పెండింగ్ పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో నూతనంగా నిర్మించి ప్రభుత్వ వృద్ధాశ్రమం, బాల రక్ష భవన్‌ను సందర్శించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉండాల్సిన సదుపాయాల గురించి కూలంకషంగా డీడబ్ల్యూఓ లలిత కుమారి, రెడ్ క్రాస్ సొసైటీ వనజరెడి, డీఈ దీపక్‌లతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. వయో వృద్ధులకు అవసర మైన సదుపాయాలు సమకూర్చాలని తెలిపారు. వయో వృద్ధుల ఆశ్రమానికి అవసరమైనటువంటి కిచెన్ రూమ్, వాష్ ఏరియా, నడవడానికి వాకింగ్ ఏరియాను స్థలాన్ని కేటాయించారన్నారు. తదుపరి బాలరక్ష భవన్‌ను సందర్శించి ప్రతి రూమును పరిశీలించారు. బాలరక్ష భవన్ లో సిబ్బంది ఉంటారని తెలిపారు. తదనంతరం రెడ్ క్రాస్ సొసైటీ వారు ఏర్పాటు చేయనున్నటువంటి జనరిక్ మెడికల్ షాప్ స్థలాన్ని పరిశీలించారు. ఐకెపి మహిళల పెట్రోల్ బంక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ రత్నం, ఎఫ్ఆర్ఓ సతీష్, వెంకటేష్, మేనేజర్ సుగుణమ, ప్రసాద్, సఖి కల్పన తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 1
మెదక్
బుధవారం | 09 ఏప్రిల్ 2025 | www.navatelangana.com

అనుమతులు లేకుండా అక్రమంగా షెడ్ల నిర్మాణం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పలు పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు యధేచ్ఛగా సాగుతోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడుతోంది. చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 136 /13614 రామ పాలీమర్స్ (పైపులు)పరిశ్రమ గతంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమ నిర్మాణాలను చేపట్టింది. తమకు స్థానిక నేతలు, అధికారుల అండ ఉందని తమను ఎవరూ ఏమీ చేయలేరని చెబుతూ ఇప్పుడు ఏకంగా షెడ్లు నిర్మిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-కంది

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఆ సంస్థ కార్యదర్శి బి.రమేష్ కంది మండలంలోని సెంట్రల్ జైలును ఆకస్మికంగా తనిఖీ మంగళవారం చేశారు.సెంట్రల్ జైలులోని బెరక్స్, గదులు, వంట గది, బాత్రూంలు జైలు ఆవరణ కలియ తిరిగి పరిశీలించారు. ఖైదీలకు జైలులో ఉన్న సదుపాయాలను, భోజనం గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వారికీ కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అన్ని అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్‌కి తెలియజేసారు. ఖైదీలతో వారికీ సమయానికి బేల్స్, ములాఖత్ అందుతున్నాయ..? అడిగి తెలుసుకున్నారు. కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూతురు కనబడటం లేదని తండ్రి ఫిర్యాదు



నవతెలంగాణ-జహీరాబాద్

కన్న కూతురు కనబడుట లేదని ఓ తండ్రి పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన జహీరాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివారులు.. పట్టణంలోని నాగుల కట్ట వద్ద నివాసం ఉంటున్న హనుమంతురావు తన కూతురు శ్వేత (19) ఈనెల 5న ఇంట్లో నుంచి వెళ్లిపోయిదన్నాడు. అప్పటీ నుంచి నేటి వరకు దొరకడం లేదన్నాడు. దీంతో హనుమంతరావు పోలీస్ స్టేషన్‌లో చేసినాడు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు. ఎవరికైనా అమ్మాయి కనపడితే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్వాడి కేంద్రంలో కంటి పరీక్షలు



నవతెలంగాణ-మెదక్‌డెస్క్

నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని అంగన్వాడీ సెంటర్‌ల్లో 6 ఏండ్లలోపు పిల్లలకు ఆర్బిఎస్కే టీమ్‌ల ద్వారా కంటి పరీక్షలు మంగళవారం ప్రారంభించారు. డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ డా.సంధ్యారాణి సందర్శించి మాట్లాడుతూ.. అంధత్వ నివారణ చర్యలో భాగంగా బుధవారం ఖేడ్ పట్టణంలో రాధ కృష్ణ మందిరం దగ్గర ఉన్న అంగన్వాడీ సెంటర్లో ఉన్న పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.తరని నిజాంపేట్ పిహెచ్సి మెడికల్ ఆఫీసర్, డా. కనీస్రి, డా. మురళి కృష్ణ, ఆర్బిఎస్కే మెడికల్ ఆఫీసర్స్, బాలరాజు పీఎంఓఓ, డా.సుషీల్ కుమార్, జట్ల భాస్కర్, నాగేశ్వరి అంగన్వాడీ టీచర్, లలిత ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8 నుంచి 22వరకు పోషణ పక్షం



నవతెలంగాణ-సిద్దిపటకలెక్టరేట్

జిల్లాలో ఈనెల 8 నుంచి 22వరకు పోషణ పక్షం కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ, సూపర్‌వైజర్లు ప్రతి ఇంటింటికి తిరిగి సామ్-మామ్ పిల్లలను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందేలా చూడాలన్నారు. దాంతోపాటు తల్లిపాలపై అవగాహన, 0 నుంచి 1 సంవత్సరం మరియు 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల ఆరోగ్య పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాను అనీమియా ముక్త్‌గా తీర్చిదిద్దేలా అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలో అనిమియా పరీక్షలు నిర్వహించాలన్నారు. న్యూట్రిషన్ ఫుడ్ గురించి ముందుగా ఐసిడిఎస్ సిబ్బంది తెలుసుకొని అందరికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సబ్బు, నీరు మరియు రెండు డస్ట్ బిన్ లను ఏర్పాటు చేసుకొని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించేలా యోగా, వ్యాయామం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో చివరగా గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డిఓ జయదేవ్ ఆర్య, డిడబ్ల్యూఓ లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి పల్వాన్ కుమార్, డిఎస్సిడిఓ. హమీద్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ తదితరులు పాల్గొన్నారు.

బందారం కథల్లో తెలంగాణ జీవితం



నవతెలంగాణ-సిద్దిపేట

నందిని సిద్దారెడ్డి కథల్లో తెలంగాణ జీవితం ఉన్నదని పత్రిక పూర్వ సంపాదకులు, ప్రముఖ సాహిత్య విమర్శకులు కే. శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం సిద్ధారెడ్డి 'బందారం కథలు' పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాల నుంచి తెలంగాణ కథ సాహిత్యం వెనుకబడిపోయిందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కథలు వస్తే పల్లె బతుకుల గుండె ఆవిష్కరణ అవుతుందన్నారు. సిద్ధారెడ్డి పీడిత పక్షపాతి అన్నారు. సాహిత్యంలో మానవీయ సంబంధాలు ఉండాలని చెప్పారు. ఈ పుస్తకం ద్వారా సాహిత్యచరిత్రలో బందారం గ్రామం నిలబడుత ందన్నారు. పల్లె జీవితాల్లో జీవన వైరుధ్యాలను ఈ పుస్తకము చక్కగా ఆవిష్కరించినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి వ్యవసాయ జీవితాన్ని సిద్ధారెడ్డి అద్భుతంగా అద్దాడని చెప్పారు. ఆయన సాహిత్యంలో రైతు సంతకం కనిపిస్తుందన్నారు. గ్రామీణ జీవితమే ఆయన బలమని తెలిపారు. తల్లి వేరు బంధారాన్ని ఆయన ఎక్కడ మరువలేదన్నారు. ఆయన సాహిత్యంలో పల్లె మూలాలు స్పష్టంగా ఉంటాయన్నారు. రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. పల్లె జీవితాల తండా తన సాహిత్యానికి దిక్సూచి అని చెప్పారు. సభలో మరసం అధ్యక్షులు రంగాచారి, ప్రముఖ కవులు పొన్నాల బాలయ్య, తైదల అంజయ్య, సిద్దంకి యాదగిరి లు మాట్లాడు తూ.. సిద్ధారెడ్డి బందారం కథలలో తెలంగాణ చరిత్ర ఇమిడిపోయిందన్నారు. యువ సాహిత్యకారులకు ఈ పుస్తకం చక్కటి ప్రేరణ అన్నారు. సభలో తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వెహికల్స్ నూతన బ్రాంచ్ ప్రారంభం

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో గ్రీన్ శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ బ్రాంచ్‌ను మేనేజర్ సూర్య ప్రకాష్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం శ్రీరామ్ ఫైనాన్స్ కస్టమర్లతో కలిసి బ్రాంచ్లో కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రజ్ఞాపూర్ బ్రాంచ్‌లో నూతనంగా రిలీజ్ అయిన గ్రీన్ ఎలక్ట్రిక్ వెహికల్, కారు, బస్, ఆటో లకు ఫోర్ వీలర్,టూ వీలర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ కు శ్రీరామ్ ఫైనాన్స్ చేయబడుతుందన్నారు. కాబట్టి ఈ అవకాశం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో కలెక్షన్ మేనేజర్ కేశవ్ దాస్, కనకయ్య, శ్రీరామ్ స్టాఫ్ పాల్గొన్నారు.

నూతన టీఎస్ ఈఈయు 327 కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సిద్ధిపేట

టీఎస్‌ఈఈయు 327 (ఐఎన్‌టియుసి) నూతన రీజినల్ అధ్యక్షులుగా బాబురావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనియన్ సర్వ సభ్య సమావేశం మరియు రీజినల్ ఎన్నికలు మంగళవారం జరిగినట్లు తెలిపారు. రీజినల్ సెక్రటరీగా శివ ప్రసాద్, ట్రెజరర్ గా భూపతి, జైపాల్ రెడ్డి, హరిశ్రీనివాస్, యాదగిరి, వజీర బేగం, సుధాకర్ రెడ్డి, ఎల్లారెడ్డి, ఐలయ్య శంకర్‌లు కార్యవర్గ సభ్యులుగా అనుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి అతిథులుగా టీజీ ఎస్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ భూపాల్ రెడ్డి, కంపెనీ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, ఇతర నాయకులు హాజరైనట్లు తెలిపారు.

గ్యాస్ మంట



- 14.2 కిలోల సిలిండర్‌పై రూ.50 భారం
- ఉజ్వల లబ్ధిదారుల్నీ వదలని కేంద్రం
- సంపన్నులకు లక్షల కోట్ల రాయితీలు
- పేద, మధ్య తరగతిపై ధరల భారాలు
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- గ్యాస్ వినియోగదారులపై ఏటా రూ.60 కోట్ల భారం
- పెంచిన ధరల్ని తగ్గించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'సంపన్నులకు పన్ను రాయితీలు...సామాన్యులపై ధరల భారాలు' ఇదీ..! ప్రధాని నరేంద్రమోడీ పరిపాలన తీరు. 11 సంవత్సరాల మోడీ పాలనలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల్ని విపరీతంగా పెంచిన ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని ధరల భారాలు మోపబడ్డాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా దేశీయంగా మాత్రం చమురు ధరల్ని పెంచుతునే ఉన్నారు. తాజాగా మోడీ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనపు భారాన్ని మోపారు. పెంచిన గ్యాస్ ధర మంగళవారం నుండే అమల్లోకి రావడంతో ప్రజలు మండిపడుతున్నారు. కేంద్రం తీరు వల్ల మార్కెట్లో మోగే ధరల మోతకు తోడుగా పేద, మధ్యతరగతి కుటుంబాల్లో గ్యాస్ మంట పెట్టారు. గృహవసరాల సిలిండర్లలో పేదలు ఉపయోగించే ఉజ్వల లబ్ధిదారులపైన కూడా కేంద్రం ఈ సారి భారం మోపింది. కేంద్రం పెంచిన ధరల భారాలు ప్రతి గ్యాస్ వినియోగదారులపైనా పడ్డాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది గృహ వినియోగదారులు అదనపు భారాలు మోయాల్సి వస్తుంది. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పలు చోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

కేంద్రం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరల ప్రభావం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పడింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1167467 వివిధ రకాల గ్యాస్ కనెక్షన్లున్నాయి. వీటిల్లో 690299 గృహ అవసరాల కనెక్షన్లు ఉండగా 110988 ఉజ్వల, 222267 దీపం, 143918 సీఎస్ఆర్ గ్యాస్ కనెక్షన్లున్నాయి. జిల్లాల వారిగా చూస్తే... సిద్దిపేట జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 320304 ఉండగా ఇందులో సింగిల్, డబుల్ సిలిండర్లు కల్గిన సాధారణ కలెక్షన్లు 173485 ఉండగా ఉజ్వల 26910, దీపం 74538, సీఎస్ఆర్ 43833 కనెక్షన్లున్నాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం వివిధ రకాల గ్యాస్ కనెక్షన్లు 612211 ఉండగా గృహవసరాలవి 408115 ఉండగా ఉజ్వల 50466, దీపం 84568, సీఎస్ఆర్ 69062 ఉన్నాయి. మెదక్ జిల్లాలో మొత్తం 234952 ఉండగా ఇందులో గృహవసరాలవి 108688 ఉండగా ఉజ్వల 33618, దీపం 63161, సీఎస్ఆర్ 29485 గ్యాస్ కనెక్షన్లున్నాయి.

ఏటా రూ.60 కోట్ల అదనపు భారం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరల వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో దీపం, ఉజ్వల వంటి పేదలతో పాటు మిగతా సాధరణ గ్యాస్ కనెక్షన్‌దారులపైన కూడా అదనపు భారం పడనుంది. ఏటా రూ.50 కోట్ల మేరకు గ్యాస్ వినియోగదారులపైన భారాలు పడనున్నాయి. గృహ అవసరాల కోసం ఉన్న గ్యాస్ కనెక్షన్లలో రోజువారిగా నెల వారిగా వినియోగించే సిలిండర్లను బట్టి భారం పడనుంది. సగటున మూడు జిల్లాల వారిగా గ్యాస్ వినియోగాన్ని బట్టి సంగారెడ్డి జిల్లాలో నెలకు రూ.2.25 కోట్లు, మెదక్ జిల్లాలో రూ.1.17 కోట్లు, సిద్దిపేట జిల్లాలో రూ.1.54 కోట్ల మేరకు అదనపు భారం పడనుంది. మూడు జిల్లాల్లో కలిపి నెలకు రూ.5 కోట్ల మేరకు భారం పడనుంది. ఈ లెక్కన ఏడాదికి రూ.60 కోట్ల మేర వినియోగదారులు కేంద్రం మోపిన భారాన్ని భరించాల్సి వస్తుంది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.410 ఉండేది. ఈ 11 ఏళ్ల మోడీ పాలనలో అనేక సార్లు సిలిండర్ల ధర పెంచుతూ రావడంతో ప్రస్తుతం పెంచిన ధర కలిపి రూ.905 అయ్యింది.

'ఉజ్వల' గ్యాస్ లబ్ధిదారులపైన కూడా కేంద్రం బాదుడు

జిల్లా	మొత్తం కనెక్షన్లు	గృహవసరాలు	ఉజ్వల	దీపం	సీఎస్ఆర్
సంగారెడ్డి	612211	408115	50460	84568	69062
సిద్దిపేట	320304	173485	26910	74538	45371
మెదక్	234952	108688	33618	63161	29485
మొత్తం	1167467	690288	110988	222267	143918

సాధారణంగా గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచిన సారళ్లా కేంద్రం మంజూరు చేసిన ఉజ్వల గ్యాస్ కనెక్షన్లకు మినహాయింపు ఇచ్చేది. ఈ సారి మాత్రం అన్ని రకాల గృహ అవసరాలకు ఉపయోగించే గ్యాస్ కనెక్షన్లపైన కూడా సిలిండర్‌పై రూ.50 భారం మోపింది. దేశంలోని నిరుపేదలందరికీ పొగ పొయ్యిలపై వంట చేయకూడదని చెప్పి సబ్సిడీపైగ్యాస్ సరఫరా చేస్తామని చెప్పిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉజ్వల పేరిట ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసింది. నిరుపేదలకే ఇచ్చామని చెప్పింది. ఈసారి పెంచిన సిలిండర్ ధరను ఉజ్వల పథకం కింద మంజూరైన లబ్ధిదా రులకు కూ డా వర్తింప చేసి పేదలపైనా భారాలు మోపింది. కేంద్రం పెంచిన భారం ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న 110988 ఉజ్వల గ్యాస్ లబ్ధిధారులపైన కూడా పడనుంది. సంగారెడ్డి జిల్లాలో 50466 మంది, సిద్దిపేట జిల్లాలో 26910 మంది, మెదక్ జిల్లాలో 33618 మంది ఉజ్వల గ్యాస్ కనెక్షన్లున్నాయి. వీరి పైన కూడా కేంద్రం ఈసారి ధరల భారాన్ని మో పింది. ఉజ్వల గ్యాస్ లబ్ధిదారులకు కేంద్రం రూ.250 సబ్సిడీ ఇస్తుంది. ఉజ్వల పథకంలో గ్యాస్ కనెక్షన్ ఉన్న వాళు రూ.500 ధరతో పాటు పెంచిన రూ.50 కూడా భరించాల్సి వస్తుంది.

సంపన్నులకు రాయితీ... సామాన్యులపై భారాలు

కేంద్రంలోని బీజేపీ సామాన్యులపై పన్నులు, ధరల భారాలు మోపుతోంది. మరో పక్క మాత్రం అదే ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల పన్ను రాయితీలు, అప్పుల మాఫీలు చేస్తోంది. దేశంలోని శతకోటీశ్వర్లుగా ఉన్న అదానీ, అంబానీ ఇతర పెట్టుబడిదారులు బ్యాంకుల్లో తీసుకున్న అప్పుల్ని ఎగవేస్తున్నారు. నష్టాల పేరిట ప్రభుత్వంలో లాబీయింగ్ చేయగానే లక్షల కోట్ల అప్పులు మాఫీ చేయడంతో పాటు పన్ను రాయితీలు కల్పిస్తుంది. 2019 సెప్టెంబర్‌లో ప్రవేశ పెట్టిన 'కార్పొరేట్ పన్ను కోతలు ప్రయివేట్ పెట్టుబడులను పెంచాయా..? నే దానిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో విపక్ష ఎంపీలు ఆర్థిక శాఖ మంత్రిని వివరాలు కోరాయి. కార్పొరేట్లకు పన్ను కోతలు పెట్టడం వల్ల కేంద్ర ప్రభుత్వం రూ.1.84 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోయినట్లు తేల్చారు. తమ వాళ్లకు రాయితీలిస్తున్న కేంద్రం పేద, మధ్య తరగతి ప్రజలపైన మాత్రం ధరలు, పన్నుల రూపాన భారాలు మోపుతునే ఉంది.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. దేశంలోని ప్రజలపైన భారాలు మోపడం సరికాదు. ఇప్పటికే నిత్యవ సరా లు, పెట్రోల్, డిజీల్ ఇతర వస్తువుల ధరలు ఆకాశా నంటా యి. కేంద్రం ధరల నియంత్రణ చట్టాన్ని ఎత్తివే యడం వల్ల విపరీతంగా పెరుగుతున్న ధరల వల్ల సామా న్యులు, మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. ఫలి తంగా పేదరికం మరింత పెరుగుతోంది. పెంచిన గ్యాస్ ధరల్ని తగ్గించాలి. లేదంటే ప్రజలు తగిన గుణపాఠం నేర్పు తారు. ధరల్ని తగ్గించాలని నిరసనలకు పిలుపునిచ్చాం.

- గొల్లపల్లి జయరాజు,
సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి

సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలకు లబ్ది

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు
- సన్న బియ్యం లబ్దిదారుని ఇంట్లో భోజనం..



నవతెలంగాణ-సంగారెడ్డి

సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలకు లబ్ది చేకూరుతుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మంగళ వారం సంగారెడ్డి పట్టణంలోని 3వ వార్డులో మంగలి కిట్టు, స్వప్నల ఇంటి వద్ద కిట్టు కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేశారు. కిట్టు కుటుంబ సభ్యులను కలెక్టర్ సన్న బియ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం పంపిణీతో మా కుటుంబం సంతోషంగా ఉందని కిట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంతో మంది నిరుపేదలకు ఈ పథకం ఉపయోగ పడుతుందని తెలిపారు. మానవతా దృక్పథంతో నడిపిస్తున్న గొప్ప పథకం అని రాష్ట్ర ప్రభుత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు.

భోజనం అనంతరం రేషన్ షాపును పరిశీలించి , సన్న బియ్యం పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 846 రేషన్ షాపులకు 3లక్షల,78 వేల728 రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు 7999 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ సమర్థవంతంగా అమలవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నాణ్యత గల సన్న బియ్యం పంపిణీ పై ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. సన్న బియ్యం పథకం ద్వారా ప్రతి ఒక్కరూ రుచి కరమైన భోజనం చేస్తున్నారన్నారు. అధిక డబ్బులు వెచ్చించి బియ్యాన్ని బయట కొనుగోలు చేయకుండా ఆర్థిక వెసులు బాటు కలుగుతుందన్నారు. సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

12న 'సుద్దాల' శ్రీ శూద్ర గంగ కావ్య గానం



నవతెలంగాణ-సిద్దిపేట

జాతీయ సీని గేయ రచయిత డా.సుద్దాల అశోక్ తేజ శ్రీ శూద్ర గంగ కావ్య గానం ఈనెల 12న నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు రంగాచారి, సీనియర్ జర్నలిస్టు విష్ణు ప్రసాద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి లోక కవి, తెలంగాణా రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మెన్ నందిని సిద్దారెడ్డి, సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, కవులు అన్నవరపు దేవేందర్, తైదల అంజయ్య, రచయిత్రి సువర్ణాదేవీ, గొర్ల పెంపకందార్ల రాష్ట్ర అధ్యక్షులు పోచబోయిన శ్రీహరియాదవ్, పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్కంసు ప్రభాకర్ వర్మ, టిఎస్‌జిఓ జిల్లా అధ్యక్షులు పరమేశ్వర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గోపాలస్వామితో పాటు పలువురు కవులు, కళాకారులు హాజరవుతారన్నారు. డాక్టర్ సుద్దాల అశోక్ తేజ ప్రజా, సీని గేయ రచయిత అన్నారు. సాహిత్య రంగంలో ఆయ నది ప్రత్యేక స్థానం అని.. సీనిమాల్లో ఆయన రాసిన పాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయ న్నారు. ప్రజా కవిగానూ అదే స్థాయిలో పేరున్న కవి అన్నారు. తండ్రి సుద్దాల హను మంతు వారసత్వంతో ప్రజా కవిత్వం రాస్తున్నారని చెప్పారు. అదే కోవలో శ్రీ శూద్ర గంగ కావ్య రచ‌న చేశారన్నారు. కావ్య గానం వినడం వల్ల ఎన్నో విషయాలు, పురాణాలు, నిగూఢంగా దాగున్న అంశాలు తెలుసుకోవచ్చన్నారు. సిద్దిపేటలోని బ్లాక్ ఆఫీస్ సమీపంలో ఉన్న విపంచి కళా నిలయంలో ఈ నెల 12న సాయంత్రం ఐదు గంటలకు శ్రీ శూద్ర గంగ కావ్య గాన సభ జరుగుతుందన్నారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యావంతులు, కవులు, కళాకారులు ఈ సభకు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మొబైల్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కొమురవెల్లి

మొబైల్ కొనివ్వలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు రైలు పట్టాల పైన ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గౌరయపల్లి శివారులో మంగళవారం జరిగింది. రైల్వే పోలీస్ నిజామాబాద్ ఎస్ఐ సాయిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీష్‌ఘడ్ రాష్ట్రం ఖబర్ధ జిల్లాలోని కర్జీది గ్రామానికి చెందిన రూపేష్(18) తన కుటుంబ సభ్యులతో కలసి కొండపాక మండలం దుద్దెడలో మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తు న్నారు. రూపేష్ తన కుటుంబ సభ్యులను సెల్‌ఫోన్ కొనివ్వాలని సోమవారం అడగడంతో వారు తిరస్కరించారు. దాంతో కుటుంబ సభ్యులతో గొడవ పడి అదేరోజు రాత్రి ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం చుట్టు పక్క గ్రామాల్లో వెతికారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం గౌరయపల్లి గ్రామ శివారులో రైలు పట్టాలపై తల భాగం తెగిపడి చనిపోయిన వ్యక్తి ఉన్నాడన్న సమాచారంతో కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు పట్టాలపై పడుకోని ఉండగా.. అతని తలపై నుంచి రైలు వెళ్లినట్లు స్థానికులు తెలిపారని.. దాంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆర్‌పి ఎస్ ఎస్ఐ సాయిరెడి తెలిపారు.

ఉపాధి హామీ కూలీ రూ.7లు పెంచడం సిగ్గుచేటు

- పార్లమెంట్ సభ్యులకు పెరిగిన జీతం 24 శాతం, కూలీలకు 2 శాతమా..?
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నర్సిములు



నవతెలంగాణ-సదాశివపేట

నిత్యవసర వస్తువుల ధరలు 11శాతం, నిరుద్యోగం 7 శాతం పెరిగిందని చెప్పిన కేంద్ర ప్రభుత్వ గణాంకాలను పక్కనపెట్టి ఉపాధి కూలీల కనీస వేతనాన్ని రూ.7లు పెంచడం సిగ్గుచేటని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నర్సిములు అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సదాశివపేట మండల కమిటీ ఆధ్వర్యంలో కంబాలపల్లి రేజింతల్ గ్రామాల పని ప్రదేశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలను అమలు చేయాలన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు అమలు చేస్తున్నట్లు రోజు కూలి రూ.800లకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి 800 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని రోజుకు రూ.8లకు పెంచాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, పట్టణ ప్రాంతాలకు పనిని విస్తరింప చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు నెలల ఉపాధి బకాయిలను వెంటనే ఇవ్వాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు అయినటువంటి మంచినీళ్లు, టెంటు, మెడికల్ కిట్లు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు. ఈనెల 15న జరగబోయే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎషోబు,మండల అధ్యక్షులు ఆంజనేయులు, మండల నాయకులు శివకుమార్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆడియోలో అధునాతన పరిజ్ఞానంపై అవగాహన



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రపంచ ప్రఖ్యాత ఆడియో టెక్నాలజీ మార్గదర్శకుడు సీనియర్ ప్రొఫెసర్ కార్ల్ హీన్జ్ బ్రాండెన్ బర్గ్, 'ఆడియో, అకౌస్టిక్స్ సిగ్నల్ ప్రాసెసింగ్ అనువర్తనాలు' అనే అంశంపై మాట్లాడి, ఆడియో రంగంలో చోటుచేసుకుంటున్న అధునాతన పరిజ్ఞానంపై లోతైన అవగాహన కల్పించారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం (ఈఈసీఈ) మంగళవారం సిగ్నల్ ప్రాసెసింగ్, అంతర్జాతీయ కెరీర్ అభివృద్ధి రంగాల విశిష్ట వక్తలతో నిపుణుల ఉపన్యాసాల శ్రేణిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బ్రాండెన్ బర్గ్ మాట్లాడుతూ..ఆడియో కోడింగ్ పరిణామం, శ్రవణ అవగాహనలో పురోగతి, మ్యూజిక్ ఇన్ఫర్మేషన్ రిట్రీవల్ (ఎంఐఆర్), స్పేషియల్ ఆడియో, హెడ్ ఫోన్ ఆధారిత లిజనింగ్ టెక్నాలజీల వంటి ఉద్భవిస్తున్న ధోరణులను ప్రొఫెసర్ బ్రాండెన్ బర్గ్ వివరించారు. రూమ్ అకౌస్టిక్స్ ఇంటిగ్రేషన్, రెండరింగ్ టెక్నిక్ పురోగతి, వాటిని వ్యక్తిగతీకరించడం గురించి చెప్పారు. 2026 నాటికి క్యూ4లో ప్రారంభించే అవకాశం ఉన్న బిల్ట్-ఇన్ హెడ్-ట్రాకింగ్ సెన్సార్లతో కూడిన కొత్త హెడ్ ఫోన్ ఉత్పత్తి కోసం ప్రణాళికలను కూడా వెల్లడించారు. ఆయనతో పాటు న్యూఢిల్లీలోని సెరాఫిమ్ కమ్యూనికేషన్స్ ఎల్ఎల్పీ వ్యవస్థాపకురాలు, సునందరావు-ఎర్డెమ్, 'జర్మనీలో వృత్తిపరమైన అవకాశాలు' అనే అంశంపై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. యువ ఇంజనీర్లకు ప్రపంచ కెరీర్ అవకాశాలను, ముఖ్యంగా జర్మన్ ఆవిష్కరణ, సాంకేతిక పర్యావరణ వ్యవస్థలో అన్వేషించడానికి మార్గాలను ప్రస్తావించారు. ఈ చర్చలు ఆకర్షణీయమైన ప్రశ్నోత్తరాల కార్యక్రమంతో ముగిశాయి. అతిథులిద్దరూ విద్యార్థుల ప్రశ్నలకు తగిన జవాబులిచ్చి ఆకట్టుకున్నారు. తొలుత, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి, అతిథులను సత్కరించారు.

తొగుటలో బర్డ్ ఫ్లూ కలకలం

నవతెలంగాణ-తొగుట

మండలంలోని కన్గల్ గ్రామ పరిధిలోని లేయర్ కోళ్ల ఫామ్ లోని కోళ్లకు హెచ్5ఎన్1 ఏవియన్ ఇన్ఫ్లుంజా వైరస్ (బర్డ్ ఫ్లూ) నిర్ధారణ కావడంతో స్థానికంగా కలకలం రేపింది. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక, పశు వైద్య శాఖ అధికారి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. సంబంధిత కోళ్ల ఫామ్‌లో ఉన్న కోళ్లను నేడు(బుధవారం) గొయ్యి తీసి పూడ్చి పెడతామ న్నారు. ముఖ్యంగా ఒక కిలోమటర్ పరిధిలో ఎలాంటి కోళ్ల ఫామ్, గ్రామం లేకపోవడం వల్ల ఇబ్బందేమీ లేదన్నారు. ఇప్పటి వరకు కోళ్ల ఫామ్‌లో పని చేసే కార్మికులకు, కోళ్లను తర లిస్తు న్న వారికి, చికెన్ షాప్ వాళ్లకు ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవన్నారు. పశు సంవర్ధక శాఖ అధ్వ ర్యంలో తుక్కాపూర్, కాన్గల్ గ్రామాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. కోళ్ల ఫామ్ పరిధిలోని కోళ్లను, గుడ్లను ఎక్కడికి తరలించకుండా నిలిపివేస్తామన్నారు. ఆ ప్రాంతంలో ఒక నాలుగు, ఐదు రోజులు అన్ని రకాల ఏర్పాట్లు చేసి వ్యాధిని ఇతర ప్రాంతాలకు సోకకుండా తగు జాగ్ర త్తలు తీసుకుంటామన్నారు. కోడి మాంసం, కోడి గుడ్లు తినేవారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. మాంసం, గుడ్లను తినేటప్పుడు బాగా ఉడికించి తింటాం కాబట్టి దానివల్ల వైరస్ చని పోతుందన్నారు. తినేవారు ఎలాంటి ఇబ్బంది లకు, భయాందోళన చెందొద్దని సూచించారు. గుడ్లను మాంసం నీటితో బాగా ఉడికిస్తాం కాబట్టి వైరస్ పూర్తిగా చనిపోతుందని చెప్పారు. దీనివల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, వైరస్ వచ్చే లక్షణాలు ఏ కోశానా ఉండవన్నారు. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురి కావద్దని వివరించారు.

756 గ్రాముల గంజాయి పట్టివేత



-ఒకరు అరెస్టు
నవతెలంగాణ-పటాన్‌చెరు

బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి పట్టణంలో నివాసం ఉంటూన్నాడు. అతని వృత్తి మేస్త్రికాగ అతని ప్రవృత్తి మాత్రం అక్రమంగా ఎండు గంజాయి విక్రయించడం. బీహార్ రాష్ట్రానికి చెందిన లాలన సహాని (45)పటాన్ చెరు పట్టణంలో గోకుల్ నగర్ కాలనీలో ఉంటూ అందరికీ మాత్రం మేస్త్రి పనులు చేసుకుంటూ తెర వెనక ఎండు గంజాయి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గోకుల్ నగర్ లో గల ఓ ఇంటిపై దాడులు నిర్వహించారు. ఇంట్లో తనిఖీలు చేపట్టగా 756 గ్రాముల ఎండు గంజాయి గుర్తించారు. ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడు వద్ద ఉన్న ఒక మొబైల్ ఫోను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. మేస్త్రిగా పనిచేస్తూ బీహార్‌లో గంజాయి కొని ఇక్కడ అధిక ధరకు అమ్ముతున్నట్లు అధికారులు తెలిపారు. లాలన సహాని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో సీఐ బి.గాంధీ నాయక్, ఎస్ఐ బి.యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎండీ.అలీమ్, డి.సతీస్ మోహన్, కానిస్టేబుల్ కరీమా, జె.ప్రహ్లాద్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

జోగిపేటలో 'ప్రవీణ్ పగడాల' శాంతి ర్యాలీ



నవతెలంగాణ-జోగిపేట

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి న్యాయం చేయాలని జోగిపేట పట్టణంలో పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీరామ్ ఆ ఫంక్షన్ హాల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ ఉమా శంకర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ ఆర్డిఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాస్టర్లకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని, ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు డేవిడ్, విజయ్ కుమార్, రత్నం, మాణిక్యం, మోసయ్య దళిత సంఘాల నాయకులు అందోల్ మల్లేశం, సంజీవయ్య మోహన్, మాణిక్యం, కరుణాకర్, దుర్గేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి, వెలిమెల గ్రామంలో మంగళవారం ఆర్కే ఫౌండేషన్ చైర్మెన్ కాల్వగడ్డ రాజ్ కుమార్ చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో అవసరమన్నారు. ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో చలివేంద్రాలు ప్రతి సంవత్సరం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సంవత్సరం కూడా ప్రజలకు ఉపయోగంగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో పేదలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్కే ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మనూర్

మనూర్, నాగల్గిద్దా మండలాల్లో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండలాల రైతులు కోరుచున్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. బయట మార్కెట్లో అమ్మాలంటే ధర తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం మద్దతు ధర కంటే క్వింటలుకు రు.1000 తక్కువగా ఉందని అందువల్ల రైతులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల వద్ద జొన్నలు రాసులుగా వెసినామని, త్వరలో కేంద్రాలు తెరువాలని కోరుతున్నారు.

కల్వర్టును ఢీ కొట్టిన బైకు



-ఒకరు మృతి, మరొకరికి గాయాలు
నవతెలంగాణ-వట్‌పల్లి

బైకు కల్వర్టును ఢీ కొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మార్వెల్లి శివార్లో మంగళవారం సాయంత్రం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మైపాలు మొగులయ్యలు ఇద్దరూ ఓకే బైకుపై మరువెల్లి, బిజిలిపూర్ గ్రామ శివారులోని రోడ్డు వద్ద నిర్మించిన కల్వర్టుకు బైకు బలంగా ఢీకొట్టడంతో కల్వర్టుపై ఎగిరి దిగువ ప్రాంతంలో అవతలికి పడిపోవడంతో బైకు వెనకాల కూర్చున్న వ్యక్తి మైపాల్ (33) అక్కడికక్కడే మృతి చెందాడు. బైకు నడుపుతున్న వ్యక్తి తీవ్ర గాయాలై కోమాలోనికి వెళ్లగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు ఏఎస్ఐ ఇన్చార్జి ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతో బారులుతీరిన జనం



నవతెలంగాణ-మెదక్‌డెస్క్

అధికారుల నిర్లక్ష్యంతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల దరఖాస్తులకు జనం బారులు తీరుతున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు. మండల అభివృద్ధి అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ఎంపీడీవో కార్యాలయంలో నిత్యం రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. కానీ ఎంపీడీవో అందుబాటులో లేకపోవడం పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల అభివృద్ధి అధికారులు లేకపోవడంతో ఖాళీ కుర్చీలతో వెలవెలబోతుంది. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ సమయానికి అధికారులు లేకపోవడం తమ సమస్యలు ఎవరికి తెలియజేయాలో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని మండల ప్రజల ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీఐకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యువజన నాయకులు



నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా మున్సిపల్ యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పారిశ్రామిక వాడలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు అన్నివేళలా కృషి కృషి చేస్తు, ప్రజల ఫిర్యాదులకు తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలు అందించడం అభినందనీయమని ప్రవీణ్ రెడి అన్నారు. మున్సిపాలిటీలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారాన్ని పోలీసులకు అందిస్తామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, రమణయ్య, సాంబయ్య రఘుపతి రెడ్డి, శ్రీను, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ తహసీల్దార్‌గా హసీనా బేగం



నవతెలంగాణ-మెదక్‌డెస్క్

నారాయణఖేడ్ మండల నూతన తహసిల్దార్‌గా హసీనా బేగం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మొగుడంపల్లి తహసిల్దార్ విధులు నిర్వహిస్తున్న ఆమె నారాయణఖేడ్‌కు బదిలీ అయ్యారు. నారాయణఖేడ్ తహసిల్దార్ భాస్కర్ కంగ్టి మండలానికి బదిలీపై వెళ్లారు.

పద్మశాలీలచే శేల్ల సమర్పణ



-ఎడ్ల బడ్ల ఊరేగింపు
నవతెలంగాణ-జోగిపేట

జోగినాథ రథోత్సవ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జోగిపేట చేనేత సహకార సంఘం అధ్యక్షుడు వర్కల అశోక్ ఆధ్వర్యంలో జోగినాథ స్వామికి శేల్ల సమర్పణ చేశారు. స్థానిక సంఘం నుంచి వస్త్రాన్ని తయారు చేసుకుంటూ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. నేసిన వస్త్రాన్ని జోగినాథ స్వామికి సమర్పించారు. పట్టణంలో రైతన్నల చేత ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన విధుల గుండా రంగురంగుల ఎడ్లబండ్లను తయారుచేసి డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ జోగినాథ్ ఆలయం వరకు కొనసాగారు.

జడిమల్కాపూర్‌లో 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్'



-పాల్గొన్నా మాజి మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్, టీపీసీసీ ఏక్సిక్యూటివ్ మెంబెర్ ధనాలక్ష్మి
నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి మండల పరిధిలోని జాడిమల్కాపూర్ గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి అతిధులుగా డాక్టర్ ఏ చంద్రశేఖర్, టీపీసీసీ ఏక్సిక్యూటివ్ మెంబెర్ ధనాలక్ష్మిలు హజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మన అందరిదన్నారు. గ్రామంలో ప్రజలందరికీ రాజ్యాంగ గూర్చి తెలియజేశారు. అందరం సమానమే అందరం కలిసి కట్టుగా వుండి మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. కులలాకు, మతాలకు అతీతంగా పని చేసే పార్టీ ప్రజల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మొగుడంపల్లి మండలాధ్యక్షులు మహమ్మద్ మాక్సూద్ , మాజీ ఎంపీపీ గుండా రెడ్డి, మాజీ ఆత్మ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి , మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, మాజీ సర్పంచ్ ఆర్షద్ పటేల్, పాల్గొన్నారు.

గ్యాస్ ధరలతో.. సామాన్యులు విలవిల



- నిత్యవసర వస్తువుల ధరలతో అల్లాడుతున్న జనం
- గ్యాస్ ధరల పెంపుతో తిన లేని పరిస్థితి
- సామాన్యులపై అధిక భారం మోపిన మోడి

నవతెలంగాణ-జహీరాబాద్

నిత్యవసర వస్తువుల ధరలు ఇప్పటికే ఆకాశాన్ని అంటుతుంటంతో ప్రజలు కనీసం రెండు పూటల భోజనం కూడా చేయలేని పరిస్థితి దాపరించింది. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కనికరం లేకుండా మరో మారు పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు పెంచడంతో సామాన్య కుటుంబాల పరిస్థితి ఆర్థిక భారంతో విలవిలలాడుతుంది. నూనె, బియ్యం, జొన్నలు, గోధుమల, చక్కెర లాంటి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటిన విషయం తెలిసిందే. కార్మికుల వేజ్ బోర్డులు ఏండ్ల తరబడి కూర్పోకపోవడంతో వారి జీతాలు మాత్రం పెరగకుండా నిత్యవసర వస్తువుల ధరలు మాత్రం పెరగడంతో వారి కుటుంబాలపై ఎనలేని ఆర్థిక భారం పడుతుంది. కనీస మద్దతు ధరలో చెల్లించాలని కనీస వేతనాలు చెల్లించాలని పనికి తగినంత వేతనాన్ని ఫిక్స్ చేయాలని ఇప్పటికే కార్మికులు కార్మిక నాయకులు ఎన్నో ఉద్యమాలు చేసిన విషయం తెలిసిందే. ప్రపంచ ఆర్థిక పరిస్థితులన్నీ అతలాకుతలమవుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం ఏ విధమైనటువంటి అనాలోచిత విధానాలతో గ్యాస్ బండపై రూ.50, పెట్రోల్, డీజిల్‌లపై లీటర్‌కు రెండు రూపాయల చొప్పున ధరలు పెంచడంతో సామాన్య ప్రజల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుంది. ఇది పాలకులు ప్రభుత్వాల అనాలోచిత విధానం కారణంగానే ఇప్పటికే దేశం ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదమున్న తరుణంలో ఈ విధమైనటువంటి నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ప్రమాదకరమని ఆర్థికవేత్తలు తెలుపుతున్నారు. ఏది ఏమైనా కేంద్ర ప్రభుత్వం గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరల పెంపుపై పునరాలోచించాలని ప్రజలు గగోలు చేస్తున్నారు.

పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచడం దారుణం



-టీఎస్ఎస్ సీసీడీసీ (ఎస్సీ కార్పొరేషన్) మాజీ చెర్మెన్ వై.నరోత్తం

అంతర్జాతీయ మార్కెట్ లో చమురు ధరలు తగ్గుతుంటే ఒకే రోజు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడం దారుణం. బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వీటి ధరలను పెంచుతూనే వస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వంట గ్యాస్ ధర సుమారు 130శాతం పెరిగింది. అదేవిదంగా పెట్రోల్ ధరలు 51శాతం, డీజిల్ ధరలు 74శాతం పెరిగాయి. ఎక్సైజ్ ట్యాక్స్‌ల పేరిట ధరలు పెంచడం సామాన్యుని నడ్డి విరచడమే అన్నారు.

పెంచిన ధరలు తక్షణమే తగ్గించాలి



-సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి బి.రామచందర్

కేంద్ర ప్రభుత్వం అనాలోచిత విధానాల కారణంగా నేడు దేశంలో రకరకాల ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో ప్రజలు ధరలు పెంచితే ఎవరు కూడా పట్టించుకోరన్న ఊహతోనే గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలను పెంచారు. పెంచిన ధరలు తక్షణమే తగ్గించాలి. లేనియెడల కార్మికులు ప్రజలతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

సాధారణ కుటుంబాలపై మోయలేని భారం



-నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు డాక్టర్ ఆస్మా

గ్యాస్ ధరలు ఒకేసారి రూ.50లు పెంచడం సాధారణ కుటుంబాలపై మోయలేని భారమని నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు డాక్టర్ ఆస్మా అన్నారు. ఇప్పటికే వివిధ ధరలు పెరగడంతో కుటుంబాలన్నీ ఆర్థికంగా చిన్న భిన్నం అవుతున్నాయి. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయం మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక స్వాలంబన తీసుకొచ్చే విధంగా ఉందన్నారు.

కుటీర పరిశ్రమలపై ప్రభావం



-బీఆర్ఎస్ జిల్లా యువ నాయకులు దిశెట్టి పాటిల్

డీజిల్ పెట్రోల్ ధరలు పెంచడంతో కుటీర పరిశ్రమలపై ఎనలేని భారం పడి మూతపడే ప్రమాదం ఉందని బిఆర్ఎస్ జిల్లా యువ నాయకులు దిశెట్టి పాటిల్ అన్నారు. కుటీర పరిశ్రమల ను ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీలతో కూడినటువంటి రుణాలు ఇవ్వడంతో యువతకు ఆర్థిక అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడంతో కుటీర పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందని దీంతో నిరుద్యోగ పెరిగే ఆస్కారం ఉందని అన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు విసిగిపోతున్నారు



-ఎంపీపీ మాజీ అధ్యక్షులు వి.రాములు

కేంద్ర ప్రభుత్వం రోజుకో విధమైనటువంటి నిర్ణయాలు తీసుకోవడంతో ప్రజలు విసిగిపోతున్నారు. పెట్రోల్, డీజిల్ పెంచడంతో ట్రాన్స్పోర్టింగ్ ధరలు పెరిగి నిత్యవసర వస్తువుల ధరలతో పాటు వివిధ రకాల ధరలన్నీ పెరిగే ఆస్కారం ఉంది. ఇప్పటికే ప్రజల్లో కొనుగోలు శక్తి పూర్తిగా పడిపోయిందన్నారు.

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలి



-పేద, మధ్య తరగతి నడ్డి విరిస్తున్న మోడీ
-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
-సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద సిలిండర్‌తో నిరసన
నవతెలంగాణ-సంగారెడ్డి

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద సిలిండర్‌తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం వేసి మోడీ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రజలపై భారలు వేస్తూ కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధరలకు తగ్గించి అందించాలి, కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం పంటగ్యాస్ సిలెండర్ పై 50రూపాయలు పెంచడం దారుణం అన్నారు. ఉజ్వల పథకం లబ్దిదారులు, సాధారణ వినియోగదారులతో పాటు, మహాలక్ష్మి స్కీం అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంపై కూడా పెద్ద భారం పడుతుందన్నారు. సంగారెడ్డి జిల్లాలో 2 లక్షల మందిపై ప్రతి రోజు రూ.15 కోట్లు భారం పడుతుందన్నారు. ప్రజల ఆదాయం మాత్రం పెరగటం లేదన్నారు. మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. బీజేపీ అధికారం లోకి వచ్చినప్పటి నుండి గ్యాస్ సిలిండర్ ధరలు 130.57 శాతం పెంచడంతో పాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందని అన్నారు. కార్పోరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలిస్తూ, రాష్ట్రంలోని వినియోగదారులపై ఏడాదికి రూ.100 కోట్ల భారం మోపుతున్నదన్నారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు మాణిక్యం, నాయకులు కృష్ణ, రేవంత్, అశోక్, బాలరాజ్, మహేష్, దత్తు, శివ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధపడాలి



-సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్
-సామాజిక సంఘీభావ నిధి సేకరణ
నవతెలంగాణ-సదాశివపేట

సమాజంలో అంటరానితనము కుల వివక్షత సామాజిక పీడన పెద్ద ఎత్తున కార్మికుల పైన ప్రభావం ఉందని కార్మికులను ఐక్యంగా ఉంకుండా కులం, మతం పనిచేస్తున్నాయని వాటికి వ్యతిరేకంగా కార్మికులందరూ ఐక్యంగా నిలబడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సదాశివపేట పట్టణంలో సామాజిక సంఘీభావ నిధి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పనిచేసే ప్రాంతంలో కూడా వివక్షకు గురి అవుతున్నారన్నారు. పెట్టుబడిదారుల సంక్షేమం లాభాల కోసమే కార్మికుల మధ్య కులం మతం ప్రాంతం అనే విభేదాలు సృష్టించి పెట్టుబడుదారులు లాభపడుతున్నారన్నారు. సమాజంలో స్వాతంత్రం వచ్చి అనేక సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా వివక్ష అనేక రూపాల్లో కనిపిస్తుందన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని కుల వ్యవస్థ మన భారతదేశంలో ఉండడం సిగ్గుచేటు అన్నారు. సీఐటీయూ సంఘం కార్మికుల సంక్షేమం హక్కుల కోసం పోరాడుతుందన్నారు. సామాజిక అంశాల పట్ల కూడా శక్తి మేరకు కృషి చేస్తుందన్నారు. ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు సామాజిక వారోత్సవాల కార్యక్రమం సీఐటీయూ నిర్వహిస్తుందన్నారు. సామాజిక అంశాల పట్ల పోరాడే సామాజిక సంఘాలకు సీఐటీయూ తన కర్తవ్యంగా కార్మికుల దగ్గర నుంచి విరాళాలు సేకరించి సామాజిక సంఘాలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహులు, రాజు, కృష్ణమూర్తి, సుధాకర్, అక్షరం గౌడ్, వెంకటేష్, హాజీ, భూషణం, శేషం, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు ధర్నా



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణం పరిధిలో రంజోల్‌లోని శ్రీరామ దేవాలయానికి, పూజారులకు పని చేసుకొని బతుకేందుకు మరోచోట కొంత స్థలాన్ని గ్రామానికి చెందిన కిష్టారెడ్డి అనే దాత గతంలో కేటాయించారు. ప్రస్తుతం మందిరం ఉన్న స్థలాన్ని ప్లాట్లుగా చేసే విక్రయించేందుకు పూజారులు ప్రణాళిక రూపొందించడంతో గ్రామస్తులు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. మంగళవారం ఆ మందిరంలో గ్రామానికి చెందిన భక్తుల పూజలను పూజారులు నిరాకరించడంతో గ్రామస్తులు ఆగ్రహ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన పెద్దలు తమ పూర్వికులు మందిరానికి సర్వే నంబర్ 66/ 61/1 నందు రెండు ఎకరాల 2.12 ఎకరాల స్థలం కేటాయించారు. అందులో మందిర నిర్మాణం కూడా ఉంది. మరోచోట సర్వే నంబర్ 40, 40/1 ,40/ 2 నందు నాలుగు ఎకరాల 32 గుంటల స్థలంను దాత కిష్టారెడ్డి కెటాయించారు. ఇట్టి స్థలాన్ని రెవెన్యూ రికార్డుల్లో 1980 వరకు రామ మందిరం పేరా రికార్డుల్లో ఉంది. 1989లో అట్టి స్థలాన్ని మహేశ్వర్, అరవయ్య, సంగయ్యల పేర్ల మీద రికార్డులు నమోదు చేశారు. అట్టి భూమిని రికార్డుల ఆధారంగా మందిరాన్ని సైతం విక్రయించేందుకు పూజారులు పూనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. తక్షణమే విరమించుకోవాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. జహీరాబాద్ పోలీసులు కల్పించుకొని ప్రస్తుతం ఆ స్థలంలో ఎవరు కూడా అక్రమ నిర్మాణాలు చేపట్టకూడదు యధావిధిగా ఉంచుకోవాలి ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉంటే కోర్టులో చూసుకోవాలని ఆందోళన విరమించాలని గ్రామస్తులకు నచ్చజె చెప్పారు దీంతో తాత్కాలికంగా గ్రామస్తులు ఆందోళనలు విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామ్ రెడ్డి, వైద్యనాథ్, రామ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నర్సింలు, లతోపాటు వివిధ హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి ఎవ్వరు తీసుకున్న కఠిన చర్యలు



-డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి
-అబ్బాస్ అలీ హతకుల అరెస్ట్
నవతెలంగాణ-జహీరాబాద్

చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నేరాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 6న రాత్రి సమయంలో ధనసిరి గ్రామానికి చెందిన అబ్బాస్ అలీ అనే యువకుడ్ని అదే గ్రామానికి చెందిన మహతాబ్ బిస్తీ ,ఖలీల్‌షాలు అతి దారుణంగా కత్తులతో పొడిచి హత్య చేశారని తెలిపారు. నిందితులు గత రెండు రోజులుగా పోలీసుల కండ్లు కప్పి తిరుగుతున్నప్పటికీ వారిని రెండు బృందాలను ఏర్పాటు చేసి మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని ఫుగట్ నగర్ నందు మహతాబ్ ఇంటి వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హత్యకు గురైన అబ్బాస్ అలీ ఖలీల్‌షా తల్లిని మొబైల్ ఫోన్ ద్వారా తరచుగా వేధిస్తూ ఉండేవాడని తెలిపారు. ఈ విషయమై పలు దఫాలుగా అబ్బాస్ అలీని ఖలీల్‌షా మందలించినప్పటికీ తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రానందున తన మిత్రుడు మహతాబ్ బిష్టితో కలసి అబ్బాస్ అలీని హతమార్చాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. మృతుడు ఆటో డ్రైవర్‌గా హైదరాబాద్ నందు ఆటో నడిపిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. దీంతో ఆయనను హతమార్చడం సాధ్యం పడలేదు. రంజాన్ పండుగకు సంబంధించి ఇంటికి వచ్చినటువంటి అబ్బాస్ అలీ తన మిత్రులతో కలిసి అక్బర్ ఫామ్ హౌస్ నందు దావత్ చేసుకుంటున్నారు. విషయాన్ని తెలుసుకున్న ఖలీల్ షా మహతాబిస్తిలో అక్కడికి వెళ్లి వెంబడి తెచ్చుకున్నటువంటి కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసినట్లు ఒప్పుకొన్నారని తెలిపారు. అడ్డు వచ్చినటువంటి అక్బర్ పై కూడా బీర్ బాటిల్తో దాడి చేసి గాయపరిచారు. హత్య చేసి తిరిగి వెళుతున్న సమయంలో మార్గమధ్యంలో శేఖర్ అనే వ్యక్తి ఎదురుగా రావడంతో ఆయనకు హత్య చేసిన కత్తి, గన్ చూపించి బెదిరించి ఆయన పైన్ ద్విచక్ర వాహనాన్ని కూడా తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారని తెలిపారు. నిందితులు ఉపయోగించిన వాహనాలు, కత్తి ఎయిర్ గన్నును స్వాధీన పరుచుకొని నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ శివలింగం, ఎస్సై రాజేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-మెదక్‌డెస్క్

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బస్ డిపో సమీపంలో గల పద్మశాలి కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి నూతన సీసీ రోడ్ల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ ఏర్పాటు జరిగి దశాబ్ది కాలం దాటిపోయిన కాలనీలో నడవడానికి సరైన రహదారులు లేక కాలనీవాసులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఏడేళ్లు పాలించిన బీఆర్ఎస్ నాయకులు ఏనాడు కాలనీ వైపు కన్నెత్తి చూడలేదన్నారు. కాలనీలో రోడ్లు మురికి కాలువల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాల అభివృద్ధి చేయడమే ధ్యేయమని అన్నారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేను తాజా మాజీ వైస్ చైర్మెన్ మున్సిపల్ కమిషనర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ దారం శంకర్ సేటు, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, పండరి రెడ్డి, శంకర్, ప్రకాష్, శ్రీశైలం, రమేష్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లను సన్మానించిన మాజీ వీఆర్ఏలు, నాయకులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో గతంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహించి అందరూ మనలను పొందిన దశరథ్ తహసీల్దార్‌గా రావడంతో గతంలో ఆయన వద్ద పనిచేసినటువంటి సిబ్బంది వచ్చి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తూ వివిధ శాఖల్లో స్థిరపడినటువంటి సిబ్బంది తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పూలమాల శాలువతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జహీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన దశరథ్ కిందిస్థాయి సిబ్బందితో సోదర భావంతో ఉండడంతోనే ఈరోజు వివిధ శాఖల్లో స్థిరపడ్డప్పటికీ వచ్చి ఆయనను అభినందిస్తున్నారని తెలిపారు.



నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ తహసీల్దారుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉమా శంకర్‌ను మంగళవారం ఆందోల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. స్థానిక కార్యాలయంలో ఆయనకు శాలువాతో సన్మానించారు. మండలంలో రైతుల సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉప తహసిల్దార్ మధుకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివరాజ్, మాజీ సర్పంచులు శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, మల్లయ్య, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, నాయకులు శివ శంకర్ గౌడ్, జైపాల్ తదితరులున్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



-మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి
నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 25'వ వార్షికోత్సవ వేడుకల్లో సీఐ రవీందర్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులను కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హెచ్ఎం మంగీలాల్‌తో కలిసి మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీధర్ రెడ్డి, వెంకటయ్య మాజీ వార్డ్ మెంబర్ శారదా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణేష్ గడ్డకు పాదయాత్రగా ఆదర్శ్‌రెడ్డి దంపతులు



నవతెలంగాణ-రామచంద్రాపురం

కార్పొరేటర్ ఎన్నికల సమయంలో మొక్కిన మొక్కు తీర్చుకోవడానికి పటాన్చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ఆయన సతీమణి భారతి నగర్ కార్పొరేటర్ సింధు రామచంద్రాపురంలోని బీరంగూడ కమాన్ నుంచి పటాన్చెరు మండలంలోని రుద్రారం గ్రామంలో గల గణేష్ గడ్డ ఆలయానికి బుధవారం ఉదయం 5 గంటలకు తన అనుచరులతో కలిసి పాదయాత్రకు బయలుదేరనున్నారు. పాదయాత్రగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మధ్యా హ్నాం అక్కడే భోజనాలు చేసి తిరుగు ప్రయాణం అవుతామని ఆదర్శ్ రెడ్డి తెలి పారు. సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి విచ్చేయుచున్నారు. కావున బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అనుచరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఏఎంఓ

నవతెలంగాణ-చేగుంట



మండలంలోని వడియారం ప్రాథమిక పాఠశాలను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఏఎంఓ సుదర్శనమూర్తి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ టెస్ట్ అలాగే ఎండ్ లైన్ టెస్ట్ ఫలితాలను సమీక్షించారు. తరగతి గదిలోని విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు. చదవడంలోనూ, రాయడంలోనూ చతుర్విధ ప్రక్రియలను విద్యార్థుల ద్వారా సమాధానాలు రాబట్టి సంతృప్తి చెందరు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిద్ధిరాములు, ఉపాధ్యాయులు వసంత, సంతోషిమాత, అమరేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి హనుమంతరావుకు ఆహ్వాన పత్రిక అందజేత

నవతెలంగాణ-నిజాంపేట



మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు చల్మెడ గంగపుత్రుల సంఘం నాయకులు ఆహ్వాన పత్రికను మంగళవారం మెదక్‌లో అందజేశారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామ గంగపుత్రుల సంఘం నాయకులు ఈనేల11న గంగమ్మ తల్లి కళ్యాణ మహోత్సవ సందర్భంగా ఆహ్వాన పత్రిక అందజేశారని, సంఘం నాయకులు తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-పాపన్నపేట



మండలంలో పర్యటించి బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మంగళవారం పరామర్శించారు. దౌలాపూర్‌కు చెందిన రాజా శ్రీధర్ రెడ్డి ఇటీవల మరణించగా వారి కుమారుడు రాజా శ్రీకాంత్ రెడ్డిని, అనంతరం కుర్తివాడలో పితృ వియోగం కలిగిన కుర్తివాడ పట్లోళ్ల నాగరాజు, వడ్డేపల్లి సంజీవరెడ్డి కుటుంబాలను, అదేవిధంగా లక్ష్మీ నగర్‌లో మరో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్, నాయకులు శ్రీకాంతప్ప, మల్లప్ప, జంగం సతీష్, ఆకుల శ్రీనివాస్, పార్శ్వ నర్సింలు గుప్త, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఎఫ్ చెక్కు పేదలకు వరం

నవతెలంగాణ-చేగుంట



చేగుంట పట్టణానికి చెందిన సోమ యాదగిరికి దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి తన నివాసం వద్ద చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ అయితే రఘురాములు, లక్ష్మణ్, భూపాల్, కిషన్, యాదగిరి, భరత్, భగవాన్, వంజరి శీను పాల్గొన్నారు.

మండల నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా బాలరాజ్

నవతెలంగాణ-చిలిపిచేడ్




మండల నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా బాలరాజ్ జనం సాక్షి రిపోర్టర్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా అనిల్, దుర్గా చలం, గౌరవ అధ్యక్షులుగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ గౌడ్, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా ప్రవీణ్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, సభ్యులుగా శంకర్, పోచయ్య శ్రీనివాస్, రమేష్, నరేష్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

- ఆర్ఐ సునీల్ చౌహాన్..

నవతెలంగాణ-చిలిపిచేడ్



అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ సునీల్ చౌహాన్ అన్నారు. మండల పరిధిలోని చండూరు గ్రామ శివారులో గల మంజీరా నదిలో ఇసుక రవాణా నడుస్తుందన్న సమాచారంతో మంగళవారం మంజీరా నదిలోకి వెళ్లి పరిశీలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు సేవించి వ్యక్తి మృతి

నవతెలంగాణ -పాపన్నపేట



పురుగు మందు సేవించి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి లక్ష్మీ నగర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం. గ్రామానికి చెందిన ముప్వ సుబ్బారావు (64) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత ఐదేళ్ళ క్రితం ఇతని కుమారుడు మృతి చెందాడు. కాగా కొన్నిరోజులుగా తన భార్య వీరమని పక్షవాతంతో బాధపడుతుంది. తరచూ అదే విషయమై ఇంట్లో బాధ పడుతుండేవాడు. మనస్తాపం చెందిన అతను ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులోని రేకుల షెడ్డు వద్ద పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం అటుగా వెళ్లిన స్థానికులు రేకుల షెడ్డు వద్ద సుబ్బారావు మృతదేహాన్ని గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి కొడుకు సాయిచంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టన్న యువకుడు మృతి

నవతెలంగాణ-నార్సింగి



అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టగా యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రం శివారు జాతీయ రహదారి 44 పై చోటు చేసుకుంది. స్థానిక ఏఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి పట్టణ కేంద్రానికి చెందిన తూర్పాట శివ (30) తండ్రి తూర్పాట దుర్గయ్యకు ఇద్దరు కొడుకులు, ప్రస్తుతం భార్య గర్భవతి. శివ తన ద్విచక్ర వాహనం (టీవీఎస్ ఎక్సెల్) పై గ్యాస్ స్టవ్, మిక్సీలు రిపేర్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం 6:15 గంటల ప్రాంతంలో తన స్వంత పని నిమిత్తం టీవీఎస్ ఎక్సెల్ బండి పై చేగుంట మండలం మక్కరాజు పేట్‌కు బయలుదేరాడు. మార్గ మధ్యంలో 6:35 గంటల నార్సింగి శివారుకు చేరుకోగా నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు మారుతి బలినో కారును డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ శివ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టాడు. ఎగిరి రోడ్డు పక్కకి పడి తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు అయి అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానిక ఏఎస్ఐ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్ తెలిపారు.

దరఖాస్తు ప్రతులను ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలి

- ఎంపీడీఓ ఆనంద్



నవతెలంగాణ-నార్సింగి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తు ప్రతులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని స్థానిక ఎంపీడీఓ ఏ.ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పథకానికి ఔత్సాహికుల నుంచి మంచి స్పందన లభిస్తోందని అన్నారు. ఈ పథకానికి అర్హులు నుంచి దరఖాస్తులు ఈ నెల 14 వరకు స్వీకరిస్తామని, ప్రభుత్వం యువత స్వయం ఉపాధి కోసం అందిస్తున్న అవకాశాన్ని అందుకోవడం కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ప్రతులను ఎంపీడీఓ కార్యాలయంలో తప్పనిసరిగా సమర్పించాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-నార్సింగి



మండలంలోని జప్తి శివునూరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయని ఎమ్ఎస్ఎస్ఓ నాయకుడు రుక్మొద్దీన్ అన్నారు.ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలు, సీడీఎఫ్ నుంచి రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చాంద్ పాషా ఆధ్వర్యంలో నాయకులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం రుక్మొద్దీన్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో గ్రామ అభివృద్ధికి రూ.30 లక్షల మంజూరు అయిన నిధులతోనే గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో గెలిచిన అనతి కాలంలోనే ఇచ్చిన హామీ ప్రకారం గ్రామ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు, గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ షేక్ షరీఫ్, పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు రాందాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చందూ యాదవ్, నాగరాజు, రమేష్ పార్టీ నాయకులు జి. స్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

"జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" అభియాన్ యాత్ర

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉమ్మన్నగారి భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్ డెస్క్



తూప్రాన్ మండలంలోని ఘనపూర్, వట్టూర్ గ్రామాలలో మంగళవారం తూప్రాన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉమ్మన్నగారి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించి, రాజ్యాంగ పరిరక్షణ పట్ల తన నిబద్ధతను మరోసారి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అన్ని వర్గాల ప్రజల హక్కులను సమానంగా కాపాడే శక్తివంతమైన పాఠశాల అని, దానిని బలహీనపరిచే విధంగా జరుగుతున్న చర్యలను ప్రజలు తీవ్రంగా ఎదుర్కోనాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ పాలన ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా సాగుతోందని, అణగారిన వర్గాలపై అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా యువత రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మాజీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డి వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మనోహరాబాద్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, బ్లాక్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సేవాదళ్ అధ్యక్షులు తాడూరి కృష్ణారెడ్డి, యువజన అధ్యక్షులు శశిభూషణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదోడి కడుపు నింపాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

నవతెలంగాణ-చేగుంట



ప్రతి పేదవాడి కడుపు సన్న బియ్యం బువ్వతో నింపాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బోనాల, కొండాపూర్, కసాన్పల్లి, చందాయి పేట, గ్రామాలలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడు పెద్దల మాదిరిగానే సన్న బియ్యంతో అన్నం తినాలన్న దృఢసంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత పథకంలో భాగంగా రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో సన్నబియ్యం పంపిణీ పథకం చరిత్ర ఆత్మక నిర్ణయం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్, యువ నాయకులు సంద్రుగు శ్రీకాంత్, గ్రామ అధ్యక్షులు రమేష్, రంగమ్మ, రాజగోపాల్ రెడ్డి, రమేష్ గుప్తా, శ్రీకాంత్ రెడ్డి, డీలర్ యాదవ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కూతురుకు గ్రూప్ 1 లో రాష్ట్రస్థాయి 8వ ర్యాంకు

- సన్మానించిన ఎంఈఓ నీరజ

నవతెలంగాణ-చేగుంట



పిల్లలు పుట్టినప్పుడు కాకుండా ప్రయోజకులు అయినప్పుడే తల్లిదండ్రులకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని మండల ఎంఈఓ నీరజ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సుధాకర్ రెడ్డి కూతురు నిఖిత రెడ్డి గ్రూప్ 1 ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు, మల్టీజోన్ రెండో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం ఈఓ నీరజ హాజరై నికిత రెడ్డిని శాలువాతో సన్మానం చేశా రు. అలాగే ప్రజా సంఘ సేవకుడు అయిత పరంజ్యోతి శాలువాతో సన్మానం చేసి నిఖిత రెడ్డి బహుమతిని అందజేశారు. ఎంఈఓ నీరజ మాట్లాడుతూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో రెండుసార్లు మెయిన్స్ రాసి, ఒకసారి ఇంటర్వ్యూకు వెళ్లినప్పటికీ కొన్ని మార్కుల తేడాతో విజయం సాధించకపోయినప్పటికీ, వెనకడుగు వేయకుండా గ్రూప్ 1లో 8వ ర్యాంకు సాధించడం సంతోషమని, విద్యార్థులందరూ ఆమెను ఆదర్శంగా తీసుకొని చదివి, ఉన్నత స్థాయిలో ఉండాలని, విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు వస్తుందన్నారు. రాజేశ్వర్, సుధాకర్ రెడ్డి, రాధా, రమ, చల్లా లక్ష్మణ్, సురేందర్, శారద, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీకి ఉత్తమ ప్రతిభ అవార్డు

నవతెలంగాణ-పాపన్నపేట



ఉమ్మడి మెదక్ జిల్లాలో 2024-25 సంవత్సరానికి పాపన్నపేట బీసీసీబీ బ్యాంక్‌కు ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది. ఈ మేరకు డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, సీఈవో శ్రీనివాస్, డీడీఎంలు కృష్ణ తేజ, నిఖిల్ కుమార్‌లు బ్యాంక్ మేనేజర్ కిషన్‌కు సోమవారం సాయంత్రం సంగారెడ్డిలో ఉత్తమ ప్రతిభ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ తాము పాపన్నపేట బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు 39 కోట్ల బిజినెస్ కొనసాగేదని తాము వచ్చాక 51.5 కోట్లకు బిజినెస్ తీసుకెళ్లామని వెల్లడించారు. 35 శాతం అభివృద్ధి సాధించిందని ఆయన వివరించారు. ఉమ్మడి జిల్లాలో తమ బ్యాంకుకు ఉత్తమ ప్రతిభ అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. తమ బ్యాంకులో గోల్డ్ లోన్, లాంగ్ టర్మ్ తదితర రుణాలు పెద్ద ఎత్తున అందిస్తున్నామని వెల్లడిం చారు. బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామని తులం బంగారం కు రూ.58 వేల వరకు ఇస్తున్నట్లు ఆయన వివరిం చారు. తాము బ్యాంకును ఇంకా ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

సరైన వైద్యం అందించక వ్యక్తి మృతి

- మృతదేహంతో కేఏకే ప్రైవేట్ ఆస్పత్రి ముందు ఆందోళన
- పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వివాద
- నష్టపరిహారం చెల్లిస్తాం ఆస్పత్రి యాజమాన్యం
- ఆందోళన విరమించిన ఆందోళన కారులు

నవతెలంగాణ-నర్సాపూర్







సరైన వైద్యం అందిచకనే వ్యక్తి మృతి చెందాడని నర్సాపూర్ పట్టణంలోని కేఏకే దావాఖానా ముందు మృతుడి బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్లితే మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం అహ్మద్నగర్ గ్రామానికి చెందిన మరాఠి వెంకాగౌడ్ రోడ్డు ప్రమాదంలో ఈ నెల 5వ తేదిన గాయాలపాలైనాడు. చికిత్స నిమిత్తం నర్సాపూర్ పట్టణంలోని కేఏకే ప్రైవేట్ దావాఖానాలో చేరడం జరిగింది. ఈ నెల 5వ తేది నుంచి 7వ తేది ఉదయం 11 గంటల వరకు దావాఖానాలో ఉంచుకొని చికిత్స అందించకుండా నిర్లక్ష్యం చేయడంతో హైదరాబాద్లోని వేరే దావాఖానాకు తీసుకెళ్ళడం జరిగిందని బంధువులు వాపోయారు. దావాఖానాలో చికిత్స పొందుతూ ఈ నెల 7వ తేదీన మరాఠి వెంకాగౌడ్ మృతి చెందారు. కాగా మంగళవారం మృతుడి బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో కేఏకే దావాఖానా ముందు ఆందోళన చేపట్టారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులకు, బంధువులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దావాఖానా సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే మరాఠి వెంకాగౌడ్ మృతి చెందాడని బంధువులు, ఆస్పత్రి పై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆస్పత్రి ముందు బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన కారులను నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ఆందోళనకారులకు పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. నష్టపరిహారం చెల్లిస్తామని దావాఖానా సిబ్బంది తెలపడంతో బంధువులు, గ్రామస్తులు ఆందోళన విరమించి మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్ళారు. దావాఖానాలో మరో మహిళ సైతం ఆమె ఆవేధనను వ్యక్తపరిచారు. తన భర్తకు కేఏకే దావాఖానాలోనే సరైన చికిత్స అందించలేదని, డబ్బులు మాత్రం పెద్ద ఎత్తున వసూళ్ల చేశారని ఆరోపించింది. ఈ విషయంపై దావాఖానా సిబ్బందిని వివరణ కోరగా రాత్రి సమయంలోనే పరిస్థితి విషమించగా వేరే దావాఖానాకు తీసుకెళ్ళాలని కోరామని అందుకు వారు ఉదయాన్నే వెళ్తామని చెప్పారని వెల్లడించారు. సదరు వ్యక్తి మృతి చెందడంతో రూ.4,50,000 నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పామని వెల్లడించారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-నర్సాపూర్



ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా మంగళవారం శ్రీ చిన్న మైల్ అంజిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మెన్ మురళీధర్ యాదవ్, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి చిన్న రమేష్ గౌడ్, మెదక్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మాజీ కౌన్సిలర్ గోడ రాజేందర్, మెదక్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ బుచ్చేష్ యాదవ్, నాయకులు యాదగిరి, మల్లారెడ్డి, సతీష్ యాదవ్, రవి, సుదర్శన్, ఆంజనేయులు గౌడ్, చంద్రయ్య, నాగేష్, దేవేందర్ యాదవ్, రామ్ రెడ్డి, రవి, లక్ష్మణ్ యాదవ్‌లు ఎమ్మెల్సీ అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానం చేశారు.

పేదల సంక్షేమం కోసం పాటుపడేది కాంగ్రెస్ పార్టీ

- రాష్ట్ర నాయకులు చిట్కుల్ మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-మనోహరాబాద్



నిరుపేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో జీడిపల్లిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం, అగ్రహారంలో జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమము చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా పేదలకు సన్న బియ్యం కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రతి పేద వర్గాలు సన్న బియ్యంతో కడుపునిండా భోజనం చేసి ఆనందంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ యువత అధ్యక్షులు నవీన్ ముదిరాజ్, పీఏసీఎస్ డైరెక్టర్ జావిద్ పాషా, మాజీ ఉపసర్పంచ్, మండల ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మన్నే ధర్మేందర్, అనిల్ రెడ్డి, కార్తీక్, నాగరాజు, రమేష్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

యువకిశోరం చంద్రశేఖర్‌కు పిహెచ్డిలో డాక్టరేట్

- డాక్టరేట్ ప్రకటించిన ఉస్మానియా యూనివర్సిటీ

నవతెలంగాణ-మెదక్ డెస్క్



తూప్రాన్‌కు చెందిన గౌడఎల్లి చంద్రశేఖర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్డీలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, చదువే తన భవిష్యత్తుకు తన జీవన గమనానికి మార్గం అవుతుందని తెలుసుకున్నారు. అమ్మ నాన్నల కష్టాన్ని చూసి, వారు చూపించిన బాటలో నడిచారు. ఒక వైపు చదువుతూనే, తాను పుట్టి పెరిగిన తూప్రాన్ ప్రాంతంలో కరువుకు కారణం అయిన ఆంధ్ర పెత్తందారులు చేస్తున్న దోపిడీని చూసి, ఉద్యమాలకు ఉస్మానియా బాట పట్టానని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో గల్లి నుంచి మొదలైన తన ప్రస్థానం, ఢిల్లీ దాకా ఉవ్వెత్తున ఎగసి పడిన కిరణం, గౌడెల్లి చంద్రశేఖర్, బతుకమ్మ ద్వారా తెలంగాణను చైతన్యం చేస్తున్న కవితక్క పోరాటాలను చూసి, అక్క వెంటే నేను అంటూ, తెలంగాణ ఉద్యమంలో పోరుబాటకు చంద్రశేఖర్ ఏ పిలుపునిచ్చిన, తెలంగాణ ఉద్యమంలో ఫిరంగిల దూసుకెళ్తూ, తెలంగాణ అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే, మరోవైపు తనకు నచ్చిన ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌లో పీహెచ్ సీటు సాధించారు. 5 సంవత్సరాలు (2019-2025) కష్టపడి చదివి డాక్టరేట్ పొందాడు. ఉద్యమాలతో పాటు ఉపవాసాలు ఉంటూ, తాను నమ్మిన అంబేద్కర్ సిద్ధాంతాన్ని భుజానబెట్టుకొని, తెలంగాణ వాదాన్ని గుండె నిండా నింపుకొని, డాక్టరేట్ పట్టా సాధించానని తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో నుంచి అత్యున్నత డిగ్రీ అయినా పీహెచ్ డాక్టర్ పట్టా సాధించాడు. డాక్టరేట్ పొందడానికి ఎంతో సహకరించిన మిత్రులకి, ఉద్యమ సహచరులకి, యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తన పరిశోదనకు సహకరించిన గురువు అయినా ప్రొఫెసర్ నవీన్ కుమార్‌కు పాదాభివందనలతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మిత్రులు, విద్యార్థి వివిధ సంఘాల నాయకులు డాక్టర్ చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు.

గొడవల విషయంలో కేసులు నమోదు

- ఎస్ఐ మధుకర్ రెడ్డి

నవతెలంగాణ-శివ్వంపేట



బోరు మోటారు విషయంలో గొడవ పడగా దాడి చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలం లోని ఉసిరికపల్లి గ్రామానికి చెందిన గుర్రం సంజీవరెడ్డి, రుక్మారెడ్డిలకు దయాదులైన గుర్రం దుర్గారెడ్డి కుటుంబంతో భూముల విషయంలో పలుమార్లు గొడవలు జరుగుతు న్నాయన్నారు. ఈనెల 6న సంజీవరెడ్డి తన ఇంటివద్ద నిలబడి తమ బోరు మోటారును ఎవరో బోరులో కిందకు పడేసారని భూతు మాటలు తిడుతుండగా అందుకు దుర్గారెడ్డి కొడుకు మధుసూదన్ రెడ్డి అభ్యంతరం తెలిపి మమ్మల్ని చూసుకుంటూ ఎందుకు తిడుతున్నారంటూ అడ్డుచెప్పి తన తల్లి గుర్రం ప్రమీలతో కలిసి బర్రెను పొలంలో కట్టేసి వస్తుండగా సంజీవరెడ్డి, రుక్మారెడ్డి అడ్డు వచ్చి దాడి చేసినరాని, ఎప్పటికైనా మమ్మల్ని చంపుతామని బెదిరిస్తున్నారని మంగళవారం ప్రమీల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శివ్వంపేటలో అదనపు కట్నం కోసం కేసు

అదనపు కట్నం కోసం వేదిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన కర్రె మైసయ్యకు మొదటి భార్య బాలమణి మరణించగా గత 12 సంవత్సరాల క్రితం నర్సమ్మతో రెండో వివాహం జరిగినదన్నారు. నర్సమ్మకు ఒక 10 సంవత్సరాల పాప ఉండగా, మైసయ్య మొదటి భార్య బాలమణికి ఇద్దరు కొడుకులు ఉన్నారన్నారు. పెండ్లాయిన ఒక సంవత్సరం దాక తన భర్త నన్ను బాగానే చూసుకున్నాడని, తర్వాత నుంచి తనను పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని తన భర్త మైసయ్యతో పాటు అతని తోబుట్టువులు, తల్లితో పాటు మొదటి భార్య కొడుకులు కూడ నన్ను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తూ అదనపు కట్నం తెమ్మని వేదిస్తున్నారని బాధితురాలు కర్రె నర్సమ్మ మంగళవారం ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భవిష్యత్తులో ఆశ వర్కర్ల హక్కుల కోసం పోరాటం

- ఆశా యూనియన్ జిల్లా నూతన అధ్యక్షురాలు శ్యామల

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



మెదక్ జిల్లాలో ఆశా వర్కర్ల సమస్యల హక్కుల కోసం భవిష్యత్తులో పోరాటం ఉదృతం చేస్తామని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నూతన అధ్యక్షురాలు శ్యామల అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ భవనంలో జిల్లా 13వ మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. మెదక్ జిల్లా నూతన ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా శ్యామల, ఉపాధ్యక్షులుగా పుష్ప, కార్యదర్శిగా సావిత్రి, కోశాధికారిగా స్వప్న, కమిటి సభ్యులుగా దుర్గ, రాణి, పద్మ, దేవమ్మ, మాధవి, మంజుల, దుర్గ భవాని, సుజాత, ఎం.పద్మ, గీత, భాగ్యమ్మలను ఎన్నుకున్నట్లు నూతన జిల్లా అధ్యక్షురాలు శ్యామల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే కాలంలో ఆశ సమస్యల పై పోరాటాలు నిర్వహిస్తామని, ఈనెల 10వ తేదీన జిల్లా కేంద్రంలోని మత శిశు ప్రభుత్వ ఆసుపత్రి మెదక్ ముందు ధర్నా నిర్వహించాలనీ మహాసభలో తీర్మానించారు.

అంగరంగ వైభవంగా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-నర్సాపూర్: నర్సాపూర్ పట్టణంలోని సునీత రెడ్డి కాలనీలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ మాత దేవాలయ జాతర ఉత్సవాలు మంగళవారం మాజీ కౌన్సిలర్లు లతా రమేష్ యాదవ్, లక్ష్మీ నాగేష్ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర ఉదయం ఒగ్గు కళాకారుల ఆట పాటల మధ్య ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. జాతర ఉత్సవాలకు వచ్చిన వారికి మాజీ కౌన్సిలర్ లతా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ జాతర ఉత్సవాలకు పలువురు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లక్ష్మీ నాగేష్ ఉన్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి మహాపూజలు

నవతెలంగాణ-శివ్వంపేట



దేశంలోనే మొట్టమొదటిగా తెలుగు రాష్ట్రాలలో ప్రప్రథమంగా నిర్మితమైన, అత్యంత శక్తిపీఠాలలో ఒకటైన మెదక్ జిల్లా శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో బగలా ముఖీ అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్ర మైన మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు మహాపూజలు నిర్వహిం చారు. అమ్మవారి ఉపాసకు లు, బ్రహ్మర్షి శాస్త్రుల వెంక టేశ్వర శర్మ ఆధ్వర్యంలో శక్తిపీఠం ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి మహాపూజలతో పాటు రుద్రయామల బగలా అష్టోత్తర నామర్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ప్రీతిపాత్రమైన పసుపుతో అర్చన (హరిద్రార్చన) నిర్వ హించడమే కాకుండా అభిషేకం, మంగ ళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించి, వివిధ రకాల ఫలాలతో నైవేద్యం సమర్పించా రు. అమ్మవారిని దర్శనం చేసుకునేందు కు హాజరైన భక్తులకు ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. మహా పూజలలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధి గ్రామమైన జప్తి శివునూరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయి. ఎమ్ఎస్ఎస్ఓ నాయకుడు రుక్మొద్దీన్ అన్నారు. ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.20 లక్షల, సీడీఎఫ్ నుంచి రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చాంద్ పాషా ఆధ్వర్యంలో నాయకులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం రుక్మొద్దీన్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో గ్రామ అభివృద్ధికి రూ.30 లక్షల మంజూరు అయిన నిధులతోనే గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. నియో జకవర్గంలో గెలిచిన అనతి కాలంలోనే ఇచ్చిన హామీ ప్రకారం గ్రామ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే కు గ్రామ నాయకులు, గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ తాజా మాజీ సర్పంచ్ షేక్ షరీఫ్, పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు రాందాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చందూ యాదవ్, నాగరాజు, రమేష్ పార్టీ నాయకులు జి. స్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన న్యాయమూర్తి



నవతెలంగాణ-సిద్ధిపేట

తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, సిద్ధిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్‌పర్సన్ సాయి రమాదేవి ఆదేశాలతో సిద్దిపేట జిల్లా జైలును న్యాయమూర్తి, డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి మంగళవారం సందర్శించారు. లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఖైదీల వంట గది, స్టోర్ రూమ్, టాయిలెట్స్ పరిశీలించారు. ఖైదీలకు కల్పిస్తున్న భోజన వసతుల గురించి జిల్లా జైలు సూపరింటెండెంట్ ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖైదీలు సత్ ప్రవర్తనతో ఉండాలని సూచించారు. అందరికి అడ్వకేట్స్ ఉండాలని తెలిపారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ వారానికి మూడు సార్లు జైలుని సందర్శిస్తారని, అడ్వకేట్స్ లేనివారికి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. నేరం చేసిన వారు తమ తప్పును ఒప్పుకున్నట్లతే కేసును అడ్మిషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వికాస్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎస్ బాలయ్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వెంకటేష్, జైలు సిబ్బంది, న్యాయసేవ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని లద్నూరు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్వేతా వెంకన్న, పి ఎస్ సి ఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ ఇర్రి రాజిరెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడీ జీవన్ రెడ్డి, తహసీల్దార్ రహీం, ఎంపీడీవో రామ్మోహన్, ఏవో రామకృష్ణ, సీఈవో బోయిని శ్రీధర్, వివిధ గ్రామాల నాయకులు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ,తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల తారాబాయి పాడె మోసిన నేతలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణానికి చెందిన ఉప్పల తారాబాయి సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు మంగళవారం జరగ్గా.. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డిలు ఆమె పాడెను మోశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఆయన సోదరులు ఉప్పల మధు, రఘువీరను పలువురు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజమౌళి, పలువురు రాజకీయ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లోన్స్ ఇప్పించాం డబ్బులు ఇవ్వండి



- మహిళా సంఘాల సభ్యుల నుంచి డబ్బులు వసూళ్లు
- అధికారులు చేపిస్తున్నారా? ఆర్పీలు తీసుకుంటున్నారా..?
- రూ.500 నుంచి రూ.2000 డిమాండ్..
- ఒక్కో సంఘంలో ఒక్కో తీరుగా వసూళ్ల దందా
- కమిషనర్ దృష్టి సారించి.. వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని మహిళల వేడుకోలు

నవతెలంగాణ-సిద్ధిపేట

ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తున్నది. ప్రతీ గ్రామంలో, పట్టణాల్లో పదిమంది మహిళలు కలిసి ఒక సంఘంగా ఏర్పడి, ఆర్థికంగా ఎదగడం కోసం మహిళా సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. వారిని ప్రోత్సహించడానికి, వారి వ్యాపార అభివృద్ధి కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పి స్తుంది. పట్టణంలో మహిళా సంఘాలకు రుణాలను ఇప్పించడానికి ఆర్పీలు సహకరిస్తుంటారు.

అయితే ఇదే అదునుగా ఈ మధ్యకాలంలో పట్టణంలో మహిళ సంఘాలకు రుణాలను ఇప్పిస్తున్న కొంతమంది ఆర్పీలు బ్యాంకు వారికి ఇవ్వాలని, ఖర్చులకోసం తమకు ఇవ్వాలని ఒక్కొక్క మహిళా సభ్యురాలు నుంచి రూ.500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ డబ్బులను మెప్మా అధికారులు వసూలు చేయమంటున్నారా లేక ఆర్పీలు వసూలు చేస్తున్నారా? అన్న విషయమే తేలాల్సి ఉంది. అయితే మున్సిపల్ కమిషనర్ ఈ విషయంపై దృష్టి సారించి.. అదనంగా డబ్బులు తీసుకోకుండా చూడాలని పట్టణ మహిళలు కోరుతున్నారు.

ఒక్కొక్క సంఘంలో ఒక్కొక్క తీరుగా వసూలు..

పట్టణంలో సుమారు 2200 మహిళా సంఘాలు ఉండగా.. 67 మంది వరకు ఆర్పీలు ఉన్నారు. వీరిలో కొంత మంది మహిళా సంఘం సభ్యుల నుండి డబ్బులు తీసుకుంటున్నారు. పట్టణంలోని భారత్‌నగర్‌లో ఈమధ్య ఒక మహిళ సంఘం బ్యాంకు నుండి రూ.15 లక్షలు రుణాలు తీసుకున్నారు. అక్కడ పనిచేసే ఆర్పి, ఆ సంఘం అధ్యక్షు రాలు బ్యాంకు వారికి ఇవ్వాలి, తాము తిరగడానికి ఖర్చు కోసం ఒక్కొక్క సభ్యురాలు వద్దనుండి రూ.1200 తీసుకు న్నారు. అంటే ఆ సంఘం నుంచి రూ.12వేలు వసూలు చేశారు. 18వ వార్డులో హనుమాన్‌నగర్‌లో ఇక్కడ ఓ మహిళా సంఘం బ్యాంకు నుండి రూ.10 లక్షలు రుణము తీసుకోగా, ఇక్కడ పనిచేస్తున్న ఆర్పి, సంఘం అధ్యక్షురాలు ఒక్కొక్క సభ్యురాలు నుంచి వెయ్యి రూపాయలు.. అంటే ఆ సంఘం నుంచి రూ.10వేలు వసూలు చేశారు. నాసరపుర ప్రాంతంలో ఓ మహిళ సంఘం బ్యాంకు నుండి రూ10 లక్షలు రుణం తీసుకోగా, ఇక్కడ పనిచేస్తున్న ఆర్పి, సంఘం అధ్యక్షులు ఒక్కో సభ్యురాలు నుండిరూ 2000 వసూలు చేశారు. అంటే సుమారుగా రూ.20వేలు వసూలు చేశారు.

అధికారులకు తెలిసే జరుగుతుందా..?

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం, బ్యాంకులు ప్రయత్నాలు చేస్తుంటే సిద్ది పేటలో మాత్రం కొంతమంది అధికారులా? ఆర్పీలా? మాత్రం మహిళల నుండి డబ్బులు దండు కుంటున్నారు. ఈ విషయాలపై మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించి, మహిళా సభ్యుల నుండి అధికంగా డబ్బులు వసూలు చేయకుండా చూడాలని మహిళా సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

నవతెలంగాణ-సిద్ధిపేటకలెక్టరేట్

పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో గ్రామీణ అభివృద్ధి శాఖ హెచ్ఆర్ జిల్లా అధికారి నరసింహారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ..గత కొన్నేండ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు.. గత 3 నెలలుగా జీతాలు రావడం లేదన్నారు. ఉద్యోగం తప్పా వేరే ఆధారం లేని తమకు వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇస్తున్న ప్రమాద బీమాను రూ.10,00,000కు పెంచాలని.. కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వలన్నారు. కెటగిరి 2లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఒకటో కేటగిరిలోకి తీసుకోవాలన్నారు. నిత్యవసర ధరలకు అణుగునంగా వేతనాలను రూ.30,000 పెంచాలన్నారు.

చిన్నారులకు ఉచిత గుండె ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-గజ్వేల్

చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ఉచిత గుండె ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిసున్నట్టు కొండపాక సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఆఫీసర్ జగన్నాథ శర్మ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో మంగళవారం 120 మంది విద్యార్థులకు ఉచిత గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథ శర్మ మాట్లాడుతూ.. సత్యసాయి ట్రస్ట్ ద్వారా దేశంలో నాలుగు ప్రాంతాల్లో చిన్నారుల హృదయ ఆరోగ్య సంరక్షణ కోసం సేవలందిస్తున్నట్లు తెలిపారు. సరస్వతి విద్యాపీఠం సూచన మేరకు గజ్వేల్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో విద్యార్థులకు గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. తమ ట్రస్టు ద్వారా ఇప్పటివరకు 30 వేల మంది చిన్నారులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి గుండె ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. చిన్నారులకు గుండె వైద్య పరీక్షలు ఆపరేషన్లు అవసరమైతే తమ ట్రస్ట్ ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి సాంబశివరావు, ట్రస్టు నిర్వాహకులు విశ్వనాథ్,డాక్టర్ గణేష్ నర్సింగ్ సిబ్బంది, పాఠశాల ప్రధానాచార్యులు హరిణ పవన్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే పురోగతి సాధ్యం



నవతెలంగాణ-దుబ్బాక

సైన్స్‌తోనే దేశ పురోగతి సాధ్యమని ఎంఈఓ జోగు ప్రభుదాస్ అన్నారు. ఇస్రో వారి యువిక - 2025 ప్రోగ్రాంకి దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులు మాడబోయిన హర్షవర్ధన్, గుంటి కౌశిక్, బండారి సుశాంత్‌లు ఎంపిక అవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ ఎస్.బుచ్చిబాబుతో కలిసి విద్యార్థులను,గైడ్ టీచర్ జ్యోతిని అభినందించారు. ఇస్రోలో 15 రోజులపాటు శిక్షణ అందుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వారి వెంట ఉపాధ్యాయులు నాగరాజు, మదన్మోహన్, నరేష్, జ్యోతి, పీఈటీ రవీందర్, సీఆర్పీ నవీన్ కుమార్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సిద్ధిపేట

పట్టణంలో నేడు ఉదయం 7:30 గంటల నుండి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రంగదాంపల్లి సబ్‌స్టేషన్‌లో మరమత్తుల కారణంగా, వైర్ల కింద ఉన్న చెట్ల తొలగింపు మూలంగా కుశాల్‌నగర్, బృందావన్ కాలనీ, మణికంఠ కాలనీ, ఆదర్శనగర్, కొత్త బస్టాండ్ ఎదురుగా, ఎల్‌ఐసి కాలనీ, శ్రీనివాస నగర్, సజీత్‌పుర, టెలికామ్ నగర్, మహాశక్తి నగర్, కెసిఆర్ నగర్, విద్యానగర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

విత్తనాలు విక్రయించే డీలర్లు లైసెన్సులు కలిగిఉండాలి



నవతెలంగాణ-గజ్వేల్

ఫర్టిలైజర్, సీడ్స్ విక్రయించే డీలర్లు లైసెన్సులు కలిగి ఉండాలని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ సూచించారు. గజ్వేల్ రైతు వేదికలో మంగళవారం ఏర్పాటుచేసిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే వానాకాలానికి సంబంధించిన ఫర్టిలైజర్, విత్తనాలు ఎరువులు విక్రయించే డీలర్ల రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. రైతులు సైతం డీలర్ నుంచి తీసుకునే విత్తనాలు ఫర్టిలైజర్ ఎరువులకు సంబంధించి రసీదును పొందాల న్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ చట్టాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు. అధిక ధరలకు విత్తనాలు ఎరువులు విక్రయిస్తే డీలర్‌పై కేసులు నమోదు చేస్తామన్నారు. స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా ఉండాలని ఆయన సూచించారు. అందులో అమ్మకాలు, నిలువలను సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏవో నాగరాజు, ఏఈఓలు డీలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్‌లో ఈనెల 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దళిత జేఏసీ చైర్మెన్ బత్తుల చంద్రమౌళి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బత్తుల చంద్రమౌళి, మాజీ వైస్ ఎంపీపీ గడిపే మల్లేష్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ మండలం నుండి ప్రతి పల్లె ప్రతి వాడనుంచి దళితులు రావాలని పిలుపునిచ్చారు. దళిత జాతికి అంబేద్కర్ ఆశించిన ఫలితాలు పూర్తిస్థాయిలో అందడం లేదని, దళిత జాతి ఐక్యంగా ఉంటేనే సాధించుకోవచ్చు అని అన్నారు.. ఈ సమా వేశంలో దళిత నాయకులు వెన్నరాజు, బోజ్జ హరీష్, గడిపే కొమురయ్య, దండి లక్ష్మి , మొగిలిపోక శ్రీనివాస్, బోజు రవి, యాస శ్రీనివాస్ ,బాబు, సంపత్, నగేష్ తదితరులు మహిళలు పాల్గొన్నారు.

కమనీయం.. నరసింహుడి తిరు కల్యాణం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని ఏక శిలగుట్టపై శ్రీ లక్ష్మి నరసింహస్వామి తిరు కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చక బృందం మంగళవారం వేదమంత్రాలతో కమనీయంగా నిర్వహించారు.ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఉత్సవ మూర్తుల విగ్రహాలకు వేద పండితులు నిర్వహించిన లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ ప్రాంగణం భక్తుల గోవిందానామస్మరణతో మారుమోగింది. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ జెల్ల ప్రభాకర్,పాలకవర్గ సభ్యులు, దేవాదాయశాఖ అధికారులు,ఆలయ సిబ్బంది,గ్రామస్తులు హజరయ్యారు.

దొమ్మాటలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండలంలోని దొమ్మాటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తాజా మాజీ సర్పంచ్ పూజిత వెంకటరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పంజాల మల్లేశంతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి మల్లేశం, తాజా మాజీ పాలకవర్గం సభ్యులు షబ్బీర్, కనకయ్య స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి కాసిం, బోర్రోళ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

తొగుటలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ

- పశుసంవర్ధక ముందస్తు చర్యలు తీసుకోవాలి
- జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

జిల్లాలోని తొగుట మండలం కన్గల్ గ్రామంలో గల మైనా లేయర్ కోళ్ల ఫామ్‌లోని కోళ్లకు హెచ్-5 ఒకటి ఏవియన్ ఇన్ఫ్లుంజా వైరస్ (బర్డ్ ఫ్లూ) నిర్ధారణ అయింది. దాంతో పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. వ్యాధి విస్తరణ జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి తగు ఆదేశాలు జారిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని కోళ్ల ఫారంలో మొదటిసారి బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిందన్నారు. బర్డ్ ఫ్లూ ప్రభావం ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా, మనుషులకు సోకకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫామ్‌లోని కోళ్ళు అన్నింటినీ శాస్త్రీయ పద్ధతిలో భూమిలో పూడ్చివేయాలన్నారు. కోళ్ల ఫామ్‌లో పనిచేసే వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కిలోమీటర్‌లోపు కోళ్లను గాని కోడిగుడ్లు గాని అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫామ్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు జరగకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 8500404016 ఏమైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. 74 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉ కోళ్ల మాంసాన్ని కానీ గుడ్లను కానీ ఉడికిస్తే వైరస్ బతకదన్నారు. మనదేశంలో 120 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పైన ఉడికించిన ఆహారాన్ని తీసుకోవడం సహజంగా జరుగుతుంది కాబట్టి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దన్నారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ అశోక్ కుమార్, జిల్లా వైద్యరోగ్యశాఖాధికారి డాక్టర్ పల్వాన్ కుమార్, సిఐ మల్లేష్ గౌడ్, డిపిఆర్ఓ రవికుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్, రెవెన్యూ, ట్రాన్స్పోర్ట్, అటవీ, పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

వరంగల్ జిల్లాలో ఏప్రిల్ 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో మద్దూరు, దూల్మిట్ట ముఖ్యకార్యకర్తల సన్నాక సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. 2001లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినప్పుడు స్థాపించిన టీఆర్ఎస్.. 2025లో రజతోత్సవ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 27న గ్రామస్థాయిలో 2001 నుంచి బీఆర్ఎస్‌లో ఉన్న సీనియర్ కార్యకర్తతో పార్టీ జెండాను ఆవిష్కరించాలనికార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు విశ్వాసం పోయిందని.. తిరిగి రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూరు, దూల్మిట్ట, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు మేక సంతోష్ కుమార్, మంద యాదగిరి, రేబర్తి పీఏసీఎస్ చైర్మెన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ జెడ్పిటిసి నాచగోని పద్మ వెంకట గౌడు, సర్పంచ్ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు దామెర మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

తపాస్‌పల్లి నిండకనే పంటలు ఎండుతున్నాయి

- కాంగ్రెస్ కృత్రిమ కరువు సృష్టిస్తుంది
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి
- బీఆర్ఎస్ రజోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని పిలుపు



నవతెలంగాణ-చేర్యాల

తపాస్‌పల్లి నిండకనే పంటలు ఎండుతున్నాయని.. కాంగ్రెస్ కృత్రిమ కరువు సృష్టిస్తున్నది అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. వరంగల్‌లో ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో చేర్యాల పట్టణం, చేర్యాల, కొమురవెల్లి మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేకనే తపాస్‌పల్లి రిజర్వాయర్ ఎండిపోయిందన్నారు. దాంతో పంటలు ఎండిపోయాయన్నారు. చేతకాని కాంగ్రెస్ నాయకులు నీళ్ళు ఇస్తున్నామని అంటున్నారని ఇది కాంగ్రెస్ పార్టీ నాయకులు సృష్టించిన కృత్రిమ కరువు ఎద్దేవా చేశారు. ఈనెల 27న జరిగే రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు సైనికులుగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమంలో చేర్యాల ప్రాంతం కీలక భూమిక పోషించిందని అదేవిధంగా రజతోత్సవసభ విజయవంతం చేయాలన్నారు.

అటవీ భూములు ఆక్రమించిన కడియం

దేవునురు,ముప్పారం గ్రామాలలో అటవిభూములను పార్టీలు మారే ఊసరవెల్లి కడియం శ్రీహరి తన కుటుంబ సభ్యులతో,తన భినామీల పెరుమీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని అక్కడి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా 'నువ్వు నాకు చీము నెత్తురులేదని అంటావా' అని పల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో చేర్యాల మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కొమురవెల్లి మాజీ జడ్పీటీసీ సిద్దప్ప,పార్టీ మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం, బిక్షపతి, మార్కెట్ మాజీ చైర్మన్ మల్లేశం, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల నరసయ్య, మాజీ కౌన్సిలర్ మంగోలు చంటి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించా లని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాల యంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానా లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుం బాలను సైతం పోషించుకోలేక ఇబ్బంది పడుతున్న తరుణ ంలో కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ పైన రూ.50 పెంచడం దుర్మార్గమన్నారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహ రించుకొని.. పేదలపై బారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి వంటగ్యాస్‌పై సబ్సిడీని అన్ని కుటుం బాలకు వర్తింపచేయడం లేదని సబ్సిడీని పేదలందరికీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభు త్వం పెంచిన ధరలను తగ్గించే విధంగారాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం పేదలపై భారాలు మోపే ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, చేర్యాల, కొమరవెల్లి మండలాల కార్యదర్శులు బండ కింది అరుణ్‌కుమార్, తాడూరి రవీం దర్, ముస్త్యాల ప్రభాకర్, రేపాక కుమార్, బోయిని మల్లేశం, స్వర్గం శ్రీకాంత్, దాసరి బాలస్వామి, యాదారం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి






నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

పెంచిన గ్యాస్‌ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా సిద్దిపేటలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రోడ్డుపై కట్టెల పొయ్యి పెట్టి గ్యాస్ బండకు తాళ్లు కట్టి మంగళవారం వినూత్న నిరసన చేపట్టారు. మరోపక్క సీపీఐ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.400ఉన్న గ్యాస్ ధర మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.905కు చేరుకుందన్నారు. కాగా తాజాగా ఒకేసారి రూ.50 పెంచారని ఇది పేదలపై మోయలేని భారం అవుతుందన్నారు. ఇప్పటికే దేశంలో పెరుగుతున్న పలు వస్తువుల ధరలతో సతమతమవుతున్న సాధారణ ప్రజలు.. మోడీ సర్కారు వంట గ్యాస్ ధరలను అమాంతంగా పెంచడంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాలిగపు శిరీష,దాసరి శిరీష,నాయకులు బత్తుల అభినవ్,వంగ రవీందర్ రెడ్డి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలి

- వ్యకాస మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్



నవతెలంగాణ-చేర్యాల

ఎర్రటి ఎండలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు మూడు నెలల నుంచి పెండింగులో ఉన్న కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చేర్యాల మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చుంచనకోట గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల సమస్యలను క్షేత్ర స్థాయిలోకి వెళ్లి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కూలీల పట్ల వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూలీలకు రకరకాల ఆంక్షలు పెడుతూ పని ప్రదేశంలో ఎలాంటి సౌకర్యాలను కల్పించకుండా కూలీల పట్ల కనికరం లేకుండా ప్రభుత్వాలు వ్యహరిస్తున్నాయని మండిపడ్డారు. పని ప్రదేశంలో మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అదే విధంగా ఎండాకాలంలో పని చేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్సెస్, గడ్డపార సానపెట్టే చార్జీలను, తట్టా, పార, పనిముట్ల చార్జీలను పని ప్రదేశంలో ఏరోజు ఎంత పని చేశారు.. ఎన్ని డబ్బులు వస్తాయి అని తెలిపే స్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. గతంలో కల్పించే సౌకర్యాలు అన్నింటిని తొలగించి రోజుకు రెండుసార్లు ఫోటో క్యాప్చరింగ్ చేస్తూ కూలీల పట్ల నిర్బంధాన్ని కఠిన తరం చేస్తున్నారని విమర్శించారు. గ్రామంలో జాబ్ కార్డులు గల కూలీలందరికీ పని చూపడం లేదని, పని చేయడానికి ఆసక్తితో ఉన్న కొత్త కుటుంబాలకు జాబ్ కార్డులను ఇవ్వడం లేదని ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలను ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నారని, గతంలో ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యాలు అన్నింటిని కల్పించాలని పనిచేసిన 15 రోజుల్లోపు ప్రతి కూలీకి కూలి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే గతంలో పనిచేసిన మూడు నెలల బకాయి డబ్బులను చెల్లించాలని లేనిపక్షంలో కూలీలను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించే పోరాటాల్లో కూలీలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పండుగ యాదగిరి, కర్రే బాలరాజు, శీల యాదయ్య, కర్రే బాబు, గొర్రె బాలమని, స్వప్న, సేవిటి సిద్దమ్మ, సీర్ల లక్ష్మయ్య, మల్లయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పేదలకు ఓ వరం



నవతెలంగాణ-గజ్వేల్

సంపన్నులకు సామాన్యులకు ఒకే రకమైన భోజనం అందించాలనే లక్ష్యంతో సన్నబియ్యం పంపిణీని ఈ ప్రభుత్వం ప్రారంభించిందని.. ఈ పతకం పేదలకు ఓ వరం అని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుంటకు శ్రీనివాస్ ఇంటిలో మంగళవారం ఏర్పాటుచేసిన సన్నబియ్యం సహపంక్తి భోజన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల పాలన అంటే తెలంగాణలోని పేదల కడుపు నింపడం మాత్రమే కాదు వారికి కష్టం రాకుండా చూసుకోవడమే అన్నారు. సంపన్నులకు, సామాన్యులకు ఒకే రకమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్ కార్డుదా రులకు సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభించారన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాపాలన, సంక్షేమం, రైతు సంక్షేమంతో, పాటు రాజీవ్ యువ వికాసం ఇంకా ఇతర పథకాలతో ప్రజా పాలన ప్రజల వద్దకు చేరువ అయ్యే విధంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మొనగారి రాజు ,సుఖెందర్ రెడ్డి ,గుంటుకు ఆంజనేయులు, మల్లేశం, మహేష్ బిక్షపతి, పూడెం సారిక శ్రీనివాస్ రెడ్డి, బోస్, సమీర్, జంగంరమేష్ గౌడ్, శివారెడ్డి, గాడిపల్లి శ్రీ ను, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం



నవతెలంగాణ-జగదేవపూర్

చేర్యాల మండలంలోని శభాష్‌గూడెంలో ఈనెల 10న నిర్వహించనున్న అంబేద్కర్ విగ్రహావిష్కరణకు రావాలని ఎంజెఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ అధ్యక్షులు గర్జకుంట రామస్వామి, ఉపాధ్యక్షులు శివదాస్ కోశాధికారి భాస్కర్‌కు ఆహ్వాన పత్రికను అంబేద్కర్ విగ్రహావిష్కరణ కమిటీ మంగళవారం అందజేసింది. అంతకుముందు స్థానిక ఎస్ఐ చంద్రమోహన్‌కు కూడా ఆహ్వాన పత్రికను అందించారు. జగదేవపూర్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ కి మరియు ఆయా గ్రామాల కమిటీలకు కూడా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్ అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్, ఉపాధ్యక్షులు గడ్డం వెంకటేష్, మండల నాయకులు నాగరాజు, మచ్చ బాబు, పైసా స్వామి ,కుర్రాడప్ప బాబు, కరుణాకర్, యాదగిరి, పోచయ్య, భిక్షపతి, రాజు, రాజు, కనకయ్య, కరుణాకర్, ప్రభాకర్ స్థానిక నాయకులు తదితరులున్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో వెబినార్



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వెబినార్ నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ యూఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ స్టేట్ 2005 వారు సూచించిన విధంగా విద్యా కేంద్రంగా బోధన అభ్యాస నైపుణ్యాల అంశంగా ఆధారంగా ఈ వెబినార్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ అనిత అబ్రహం తెలిపారు. ఈ కార్యక్రమంలో 175 స్కాలర్స్ విద్యార్థులు పాల్గొన్నారు. బోధన నైపుణ్యాలు, అభ్యాసన నైపుణ్యాలు పలు అంశాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కమల క్రిస్టియన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యాం నిర్మాణానికి కృషి చేయాలి

- కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం శివారులో గల మత్తడి బండకుంటపై చెక్‌డ్యాం నిర్మాణానికి కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు స్థానిక వినతిపత్రం అందజేసినట్టు బీజేపీ నాయకుడు సాన వేణు తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి.. మత్తడి బండపై చెక్ డ్యాం నిర్మాణం వల్ల రేగులపల్లి, చీలాపూర్, గుండారం, పెరుకబండ పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగుతాయని.. రంగనాయక సాగర్ ద్వార సాగునీరందించే సాగు కాల్వకు శాశ్వత నిర్మాణం చేపట్టాలని కోరినట్టు బీజేపీ రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్ వర్మ తెలిపారు. వినతపత్రంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడం ఆనందనీయమని బీజేపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు.

అహిల్యా బాయి హెూల్కర్ విగ్రహ ప్రతిష్ట



నవతెలంగాణ-గజ్వేల్

సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆకుల నరేష్ బాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి లోకమాత అహిల్యా బాయి హెూల్కర్ విగ్రహం ఏర్పాటు చేశామని నరేష్ బాబు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని క్యాసారం చౌరస్తాలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. తన జీవితమంతా ప్రజల బాగోగుల కోసం కృషి చేశారన్నారు. ఇండోర్ మహారాణి, లోకమాత అహిల్యా బాయి హెూల్కర్ కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని పునర్నిర్మించి దేశం నలుమూలలా ఎన్నో ఆలయాలను పునరుద్ధరించిందని కొనియాడారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-గజ్వేల్

పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఈ నిరసనల్లో సీపీఐ గజ్వేల్ నియోజకవర్గం కార్యదర్శి శివలింగు కృష్ణ మాట్లాడు తూ.. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర, నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదల నడ్డివిరిగేలా చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ నాయకులు పోచయ్య రమణాకర్, సాయికుమారు, బిక్షపతి, ఎల్లం కనకయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడ్రన్ బస్టాండులో చెత్తకుండీని ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిద్ధిపేట

పట్టణంలోని మోడరన్ బస్టాండ్‌లో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని, చెత్త సేకరణ కోసం ఒక డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌ను బస్సు డిపో మేనేజర్ రఘు కోరారు. ఈ మేరకు మంగళవారం సిద్ధిపేట డిపోకు నూతనంగా వచ్చిన డిపో మేనేజర్ రఘు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని కోరినట్లు రఘు తెలిపారు.

బస్సు ఛార్జీలకే సీఎం సహాయ నిధి డబ్బులు



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చిన తర్వాత సీఎం సహాయ నిధి కేవలం బస్సు ఛార్జీలకే సరిపోతున్నాయని గజ్వేల్ బీఆర్ఎస్ నాయకులు నర్సింగారావు, మల్లేశం అన్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన నరేష్ కుమార్‌కు రూ.18 వేల సీఎం సహాయ నిధి చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి కృషిచేసి ఆసుపత్రిలో అయిన ఖర్చుల్లో 60 శాతం సాయంగా అందించామన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆస్పత్రిలో ఎంత ఖర్చు అయినా.. కేవలం రూ.60 వేలకు మించకుండా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వానికి పేదలపై చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటికైనా సీఎం సహా నిధి డబ్బులను పెంచాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సిద్దిపేట

తోర్నాల 33కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా నేటి(బుధవారం) ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరుకోడు, బూరుగుపల్లి, బుస్సాపూర్, వెంకటాపూర్, తోర్నాల, అప్పనపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నా రు. వ్యవసాయదారులు, గ్రామ ప్రజలు, పరిశ్రమల వారు తమకు సహకరించాలని కోరారు.

గజ్వేల్‌లో టైక్వాండో కలర్ బెల్ట్ టెస్టులు



నవతెలంగాణ-మర్కుక్

సాయి జీడీఆర్ హైస్కూల్ గజ్వేల్‌లో టైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ లను సోమ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 32 మంది విద్యార్థులు పాల్గొని ఎల్లో బెల్ట్ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మాస్టర్ స్వామి, ముఖ్య అతిథులుగా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంతోష్ గుప్తా, దేశబోయిని నర్సింలు, సిద్దిపేట జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు పాల్గొని విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్స్ అందజేశారు. టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ సిద్ధిపేట్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాస్టర్ స్వామి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క విద్యార్థిణీ, విద్యార్థులు , యువకులు మీరు నేర్చుకున్న ఓలంపిక్ రికాగ్నైస్డ్ టైక్వాం డో విద్యకు సంబంధించిన సర్టిఫికెట్ భవిష్యత్తులో ఉపయోగపడు తుందన్నారు. నాయకులు పోయిల ఆంజనేయులు , కుంట సత్యం, శ్రీకాంత్ తదితరులున్నారు.

అత్యాశ వద్దు.. కష్టార్జితమే ముద్దు



నవతెలంగాణ-దుబ్బాక

సులువుగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశకు పోయి.. ఆన్‌లైన్ గేమ్స్,బెట్టింగ్ యాప్ లకు బానిసలై నేటి యువత విలువైన జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని సీఐ పి.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి చదివి ఉద్యోగం,వ్యాపారం చేసుకోవాలన్నారు. మంగళవారం దుబ్బాకలోని సీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కష్టపడకుండా ఇంట్లోనే ఉంటూ డబ్బు సంపాదించవచ్చు అని సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలకు ఆకర్షితులై ఎంతోమంది మోసపోతున్నారని అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. దురలవాట్లకు బానిసలు కాకుండా.. కష్టపడి పని చేసుకుంటూ సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయుడికి ఆత్మీయ వీడ్కోలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన వడ్లకొండ శ్రీనివాస్‌కు మంగళవారం బోధన సిబ్బంది, విద్యార్థులు,గ్రామస్తులు శాలువ కప్పి జ్ఞాపికను అందజేసి ఘన వీడ్కోలు పలికారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు,అయా మండలంలోని పాఠశాలల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

సర్కార్‌ను అభాసుపాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-దుబ్బాక

ప్రభుత్వ భూముల్ని హెచ్‌సీయూ భూములుగా, ఏఐ టెక్నాలజీతో లేని వన్య ప్రాణులను ఉన్నట్లుగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టులు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ లచ్చపేట కమిటీ నాయకులు పడాల వినయ్ కుమార్,శ్రవణ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దుబ్బాక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గంగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అన్వర్, పలువురున్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి



నవతెలంగాణ-దౌల్తాబాద్

ఈనెల 27న వరంగల్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలిరావాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు సంబారపు నాగరాజు పిలుపునిచ్చారు. 10 లక్షల మందితో సభను విజయవంతం చేయాలని కేసీఆర్ భావిస్తున్నారని.. కాబట్టి సభకు ప్రతీ ఒక్క కార్యకర్త ఆ దిశగా పనిచేయాలన్నారు.

ఎమ్మెల్యేలు, ఎంపీకి వివాహ ఆహ్వానం



నవతెలంగాణ-దౌల్తాబాద్

ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు పబ్బ మాధవి, ఆర్యవైశ్య మహాసభ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు పబ్బ అశోక్ గుప్త దంపతుల పెద్ద కుమారుడు శరత్‌కుమార్ వివాహం ఈనెల 23న వీఆర్ఆర్ గార్డెన్‌లో జరగనుంది. ఈ వివాహ మహోత్సవానికి హాజరవ్వాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మెదక్ ఎంపీ మాధవనేని రఘు నందన్ రావు, దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సోలిపేట సుజాత, కుమారుడు సతీష్‌రెడ్డి, దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ బీసీ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్‌లకు మంగళవారం రోజున ఆహ్వాన పత్రిక అందజేసినట్టు పబ్బ అశోక్ గుప్త తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్ శాఖకు సహకరించాలి

నవతెలంగాణ-నంగునూరు

సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోలీస్‌శాఖకు సహకరించాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను కోరారు. సోమవారం రాత్రి నంగునూరు మండల కేంద్రంలో పోలీసు కళాబృందం ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జరిగిన కనువిప్పు సమావేశంలో రూరల్ సీఐ శ్రీను మాట్లాడుతూ.. నంగునూరులో అమాయకులైన వృద్ధ దంపతులను చంపడం అమానుషమన్నారు. చట్ట ప్రకారం వారికి శిక్ష పడే విధంగా కేసు పరిశోధన చేయడం జరుగు తుందన్నారు. గ్రామంలో, గ్రామ శివారులో ఉన్న ఇండ్లకు, ఫామ్‌హౌస్‌లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా రక్షణగా నిలుస్తాయని.. సీసీ కెమెరాల వల్ల ఎన్నో కేసులు ఛేదించడం జరిగిందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. సైబర్ నేరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. అవసరం మేరకే సెల్ ఫోన్ వాడాలని, గూగుల్ పే, ఫోన్ పే చేసేటప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుగ్మతల గురించి సిద్దిపేట పోలీస్ కళా బృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు రాజేశ్, భాస్కర్, యాదగిరి, నర్సింలు, బాబు, మంజుల, రాజమణి, వెంకటేష్, నాటకం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, రాజ గోపాల్ పేట ఎస్ఐ ఆసీఫ్, సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి, దుబ్బాక ఎస్ఐ గంగరాజు, భూంపల్లి ఎస్ఐ హరీష్, ఆర్ఎస్ఐలు బాలకృష్ణ, సాయి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలి



నవతెలంగాణ-నంగునూరు

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని.. పేదల మీద భారం మోపే పద్ధతిని మానుకోవాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఈ సమయంలో వంట గ్యాస్ పైన రూ.50 పెంచడం దుర్మార్గమన్నారు. పెంచిన ధరల ను వెంటనే ఉపసంహ రించుకొని, పేదలపై భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబా నికి వంట గ్యాస్‌పై సబ్సిడీని అన్ని కుటుంబాలకు వర్తింప చేయడంలేదన్నారు. సబ్సిడీని పేదలందరికీ వర్తించే విధంగా చర్యలు తీసుకో వాల న్నారు. పెంచిన ధరలను తగ్గించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకు రావాలని సూచించారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభు త్వం పేదలపై భారాలు మోపే ప్రజా వ్యతిరేక విధానాల పై సీపీఐ(ఎం) పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలంతా కలిసి రావాలని సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

- ఎంపిడిఒ శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

ప్రభుత్వ ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోవర్ధనగిరి మదిర గ్రామం చిన్న ముత్యంపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం లో మండల విద్యాధికారి వడ్లకొండ నర్సయ్యతో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల, ప్రజల విశ్వాసం పొందగలుగుతారన్నారు. పాఠశాలలో సొంత ఖర్చులతో విద్యుద్దీకరణ, ప్రభుత్వ నిధులతో పాఠశాల వరకు రోడ్డు నిర్మాణం చేయడం గొప్ప విషయమన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. నిర క్షరాస్యత భాష, ఉచ్చారణ సరిగ్గా లేని చోట ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవచూపి విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న ప్రధానోపాధ్యాయులు జి. సత్యనారాయణను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గడ్డం మహా లక్ష్మి, పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సోమ గారి నాగిరెడ్డి, మండల అధ్యక్షులు పుల్ల గూర్ల రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ అమరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, సిఆర్పిలు వెంకటస్వామి, బాల కృష్ణ, శ్రీనివాస్, ఉపా ధ్యాయులు రుక్మద్దీన్, చంద్రం, కాంప్లెక్స్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటరావుపేట ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను సాగనివ్వం



నవతెలంగాణ-తొగుట

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను సాగనివ్వమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి అన్నారు. మండలంలోని ఎల్.బంజరుపల్లి నుంచి లింగాపూర్ మీదుగా వెంకట్రావుపేట వరకు జైబాపు.. జై భీమ్.. జై సంవిధాన్ పాదయాత్ర మంగళవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌లు రాజ్యాం గాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ బద్ధ సంస్థ లను నిర్వీర్యం చేస్తూ, ప్రజాస్వామ్య విలు వలను కొల్లగొడుతున్నరని మండిపడ్డారు. ఆ పార్టీలు ప్రజల హక్కులను కాలరాస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉందని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను సాగనివ్వమని హెచ్చరించారు. గాంధీ, అంబేద్కర్లు నింపిన స్ఫూర్తి తో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు ప్రవీణ్, మాజీ ఎంపీపీ గంట రేణుక రవీందర్, సీనియర్ నాయకులు కొంగరి నర్సిములు, పబ్బతి మల్లారెడ్డి, ఎన్నం భూపాల్ రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు భాస్కర్, కనకయ్య, ఓలపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకై రాజ్‌పుత్ ఫౌండేషన్ స్థాపన



నవతెలంగాణ-అక్కన్నపేట

మండల కేంద్రంలో రాజపుత్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ధరావత్ తిరుపతి నాయక్ నూతన కార్యాలయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్యతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ.. రాజపుత్ ఫౌండేషన్ ప్రజాసేవ కోసమే ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తన చిన్నతనంలో ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి చేరుకోవడం అందరి సహకారం ఉందన్నారు. పేద ప్రజలకు సేవ చేసేందుకే మండల కేంద్రంలో కార్యాలయాన్ని అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. గత పదేండ్ల నుండి పేదలకు అనేక స్వచ్ఛంద కార్యక్రమాలతో పాటు విద్య, వైద్యం కొరకు సహకారం అందించినట్టు చెప్పారు. నిరుపేద కుటుంబంలో పెండ్లిలకు ఆర్థిక సాయంతో పాటు మృతి చెందిన కుటుం బాలకు ఆసరాగా నిలబడ్డట్టు చెప్పారు. సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడుస్తూ తన జాతి కోసం శ్రమిస్తూనే ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల సంజీవరెడ్డి ,బద్దం రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రవి నాయక్ త్రిమూర్తి బైకానీ శ్రీనివాస్, గంపల శ్రీనివాస్, చింతల బాలరాజు, దాము, అశోక్ తదితరులు, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-కొమురవెల్లి

మండలంలోని పోసానిపల్లి గ్రామంలో గల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలో వసతులను, మధ్యాహ్న భోజన సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులతో సంభాషించారు. అనంతరం కొమురవెల్లి కమాన్‌వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. కేజీబీవీ లో ఉన్న సౌకర్యా లను, బోధనా పద్ధతులపై విద్యార్థినిలతో మాట్లాడి తెలుసుకున్నారు. వంట గది పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దివ్య, ఎంపీడీవో శ్రీనివాస వర్మ హౌసింగ్ పీడీ దామోదర్ రావు, మిషన్ భగీరథ ఏ ఈ దివ్య, ఎంఈఓ రమేష్, డిటి గోపాల్ రావు, ఆర్ఐ శ్రీనివాస్, ఐకెపి సిబ్బంది, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోడీ విధానాలు ప్రమాదకరం

నవతెలంగాణ-గజ్వేల్

రాజ్యాంగం విషయంలో మోడీ అనుసరిస్తున్న వైఖరి ప్రమాదకరంగాని ఉందని మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్ పల్లి, సంగాపూర్ గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణకై సంవిధాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు ముఖ్యంగా రాజ్యాంగం విలువ కాపాడే వారికి నచ్చడం లేదన్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సలహాలు సూచనలతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రాజు, జక్కి, రమేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జహీర్, రేగొండ, గాడి పల్లిశ్రీనివాస్, సుభాష్, అమరేందర్, గుంటుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై కూర్చుని మాజీ సర్పంచ్‌ల నిరసనలు



నవతెలంగాణ-తొగుట

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కమిషనర్ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయం హైదరాబాద్‌లో సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో.. ప్లకార్డులతో మోకాళ్లపై కూర్చుని మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్లల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సర్పంచులు పెండింగ్ బిల్లులు రాక గోస తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నమని చెబుతూనే కాలయాపన చేస్తున్నారన్నారు. బిల్లులు చెల్లించకుండా కక్ష సాధింపు చర్యలు చేపట్టడం తగదన్నారు. నేటి వరకు శాంతియుత మార్గంలో అనేక కార్యక్రమాలు చేశామని.. ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి, గవర్నర్ లను కలిసి వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకపోవడం బాధాకరమన్నారు.తమ పెండింగ్ బిల్లులు ఇచ్చేవరకు ప్రతిరోజు కార్యక్రమాలు నిర్వహి స్తూనే ఉంటామన్నారు. రానున్న రోజులలో ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విదంగా ఉద్యమ కార్యాచరణ ఉంటుందని ప్రభుత్వానికి హెచ్చరించారు. మహబూబాద్ జిల్లా కురివి మండలం కాకుల బోర్డు తండా మాజీ సర్పంచ్ గుగులోతు కౌసల్య, ఆమే భర్త గుగులోతు కిషన్ నాయక్(50) అప్పుల బాధతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తు చేశారు. దాంతో గన్‌పార్క్ వద్ద వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశబో యిన మల్లయ్య, కార్యదర్శి బొడ్డు నర్సింలు, రాష్ట్ర జెఏసీ నాయకులు సముద్రాల రమేష్, మన్నె పద్మా రెడ్డి, వై. అరవింద్ రెడ్డి, ఓర్సు వెంకటేష్, మంగ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి కళ్లలో ఆనందమే కాంగ్రెస్ లక్ష్యం



నవతెలంగాణ-నంగునూరు

రాజ్యాంగ రక్షణ ధ్యేయంగా.. పేదవాడి కళ్లలో ఆనందమే లక్ష్యం గా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పనిచేస్తున్నదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. మండలంలోని మగ్దుంపూర్, రాంపూర్ గ్రామాల్లో మంగళవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జులు బొమ్మల యాదగిరి, పయ్యావుల యెల్లం యాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ రక్షణే ఏఐసీసీ ధ్యేయమన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, ఎంపీటీసీ ఎనగందుల నితిన్ కుమార్‌ల ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. రాంపూర్ గ్రామంలో అంతకు ముందు బాబాసాహెబ్ డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూంమంత్రి అమిత్ షా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పైన, ఆయన రచించిన రాజ్యాంగంపై చేసిన వ్యాఖ్యలు కుట్రపూరితమని ఖండించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎనగందుల యాదగిరి, ఉపాధ్యక్షులు గాండ్ల రమేశ్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు బాగు శ్రీకాంత్ యాదవ్,మాజీ సర్పంచులు తిప్పని రమేశ్, రవీంద్ర చారి, చేర్యాల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌ఇండియా కిసాన్ న్యాయ యోధ రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-తొగుట

ఆల్ ఇండియా కిసాన్ న్యాయ యోధ రాష్ట్ర కన్వీనర్‌గా కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి నియామకం అయినట్టు ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ అఖిలేష్ శుక్లా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన చెరుకు శ్రీనివాస్ రెడ్డిని ఆల్ ఇండియా కిసాన్ న్యాయ యోధ రాష్ట్ర కన్వీనర్‌గా నియ మిస్తూ అదనపు బాధ్యతలు అప్పగించారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికే ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ నేషనల్ కో ఆర్డినేటర్‌గా ఉత్తర ప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ తరపున ఆయా రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ బాద్యులతో పలు సమావే శాలు నిర్వహించారు. రైతు లకు సం బంధించిన అంశాలపై, సమస్యలపై చర్చించి.. వారి సమస్యల నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కార్యక్రమాల్లో పలు సూచనలు చేశారు. దాంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆల్ ఇండియా కిసాన్ న్యాయ యోధ రాష్ట్ర కన్వీనర్ నియ మించి కమిటీ సభ్యులను ప్రకటించింది. జాతీయ జాయింట్ కో కన్వీనర్ గా డి. శ్రీకాంత్, జాతీయ కో ఆర్డినేటర్‌గా ఎస్.రమేష్, రెహమాన్, జాయింట్ కో కన్వీన ర్‌గా డి.కుమా ర స్వామి, కన్వీనర్‌లుగా శరత్, మొహెునొ ద్దీన్‌లు నియామకం అయ్యారు.

కన్నుల పండుగ్గా శ్రీ సీతారామ కళ్యాణం



నవతెలంగాణ -నంగునూరు

మండలంలోని రాంపూర్ గ్రామంలో గల సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రీరామనవమి తర్వాత వచ్చే ఏకాదశి రోజు నుంచి శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలను నిర్వహిస్తారు. భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం అనంతరం అక్కడి నుండి వచ్చిన తలంబ్రాలతో ఏకాదశి రోజున శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహించి వార్షికోత్సవాలను ప్రారంభిస్తారు. అందులో భాగంగా మంగళవారం శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవం కన్నుల పండుగ్గా జరిగింది. మంగళవారం ఉదయం విశ్వక్సేనుడి ఆరాధనతో వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పుణ్యాహ వాచనం, రక్షా బంధనం కార్యక్రమాలు నిర్వహించారు. పుట్ట బంగారం తెచ్చి, అంకురారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం కార్యక్రమం అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం వేదోక్తంగా నిర్వహించారు. అంతకుముందు భద్రాచలం నుంచి తీసుకువచ్చిన తలంబ్రాలను, ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి ఆలయంలోని కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం శ్రీ సీతారామ చంద్రుల కల్యాణాన్ని వేద పండితులు నిర్వహించారు. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మహిళలు శ్రీ సీతారామ చంద్రులకు ఓడి బియ్యం సమర్పించారు. కళ్యాణం అనంతరం నిత్య హవనం, బలి హరణం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

అంగరంగ వైభవంగా రంగనాయక స్వామి రథోత్సవం



నవతెలంగాణ-జగదేవపూర్

మండల కేంద్రంలో గల శ్రీ రంగనాయకుల స్వామి జాతర ఉత్సవాలు మంగళవారం స్వామి వారి రథోత్సవంతో ముగిశాయి. ప్రతీయేట శ్రీరామ నవమి రోజు స్వామి వారి కళ్యాణంతో ఉత్సవాలు మొదలవుతాయి. మరునాడు సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో పల్లకి సేవ నిర్వహిస్తారు. మూడో రోజు ఉదయాన్నే బ్రహ్మ ముహూర్తంలో దిష్టి కుంబలు తీసి గ్రామంలోని పుర వీధుల్లో భక్తులు స్వామి వారి రథోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అనంతరం స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రఘు పంతులు, ఆలయ నిర్వాహకులు మన్నె ప్రకాష్,రవి,మన్నెవారి కుటుంబం, నాయకులు , యువత,గ్రామ ప్రజలు, భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల నిర్వాణ కోసం సమావేశం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ సీతారామ ఉమామహేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల గురించి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే బ్రహ్మోత్సవాలను సమిష్టిగా వైభవంగా నిర్వహించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. కళ్యాణోత్సవాలను రథోత్సవాలను ఘనంగా చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని.. నిరంతరం అన్న ప్రసాద వితరణ జరగాలని భక్త బృందం నిర్ణయించారు.

మంతూర్‌లో పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-రాయపోల్

మండలంలోని మంతూర్ గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగాపీఏసీఎస్ వైస్ చైర్మన్ పాల రవీందర్ గౌడ్, సిద్ధంకి ప్రభాకర్‌రెడ్డిలు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో గ్రామస్తులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఈ ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉన్నదన్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కాపాడుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

అంబేద్కర్ ఆశయాలను భారతదేశంలో ఉన్న ప్రతీ పౌరుడు కాపాడుకోవాలని జైబాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కోఆర్డినేటర్ ఆలేటి సిద్ధి రాములు కోరారు. మండలంలోని వల్లంపట్ల, వంగపల్లి, గ్రామాల్లో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మేక మల్లేశం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వంగపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని బాపు చూపిన సన్మార్గంలో నడవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గిరి కొండల్ రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామెడీ జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గుండెగోని లలితా మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, మనోహర్, శ్రీధర్ రెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు బియ్యం మహేష్, పద్మా రెడ్డి, రామడుగు బాలరాజు, కనకచంద్రం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్న బీజేపీ

- పలు మండలాల్లో జై సంవిధాన్ కార్యక్రమం











నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ జై భీమ్.. జై బాపు.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మాజీ ఎంపీటీసీ తుప్పతి అంజి యాదవ్ అన్నారు. కొడకండ్ల గ్రామంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొడకండ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీ 6,7, వార్డుల్లో పాదయాత్ర చేపట్టామన్నారు. దేవుడి పేరుతో ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీల రిజర్వేషన్లు ఎత్తివేయాలని బీజేపీ ప్రయత్నం చేస్తున్నదన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నం చేస్తున్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రజలందరూ ఏకమై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముంద్రాతి కొండయ్య, బాలకృష్ణ, బాల నరసింహులు, మేకల నరసింహులు,మల్లం లక్ష్మణ్, దూలం గణేష్, కొడకండ్ల నర్సింలు, పుల్ల కనకయ్య, గజ్వేల్ మహేష్, ఎండి ఖలీల్, చేర్యాల మల్లేష్, తుప్పతి కనకయ్య, బిక్షపతి, ఎండి అజీమ్, కరుణాకర్, స్వామి, అశోక్, రాజు, అఖిల్ చంద్రశేఖర్, యంగ్ లక్ష్మి, పుల్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని కాంగ్రెస్ సిద్ధిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజలహరి కృష్ణ, పట్టణాధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో ఏఐసీసీ ఆదేశాల మేరకు జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర మంగళవారం 38, 17, 18 వార్డుల్లో వార్డు ఇంచార్జ్ బైరి నాగమణి, బైరీ ప్రవీణ్, సీతా బాలుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరి బాగోగుల కోసం రాజ్యాంగాన్ని రచించా రన్నారు. కానీ రాజ్యాంగాన్ని కేంద్ర మోడీ ప్రభుత్వం అవహేళన చేస్తున్నద ్న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, గంప మహేందర్, సాకి ఆనంద్, ముద్దం లక్ష్మి, పూజల గోపి, సతీష్ గౌడ్, వహీద్ ఖాన్, రి యాజుద్దీన్, సంతోష, రజిని, సన, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

గడచిన పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ కేంద్రమంత్రి అమిత్ షా ప్రపంచ దేశాల్లోనే గొప్పదైన మన భారత రాజ్యాంగాన్ని అవమానించారని.. అలాగే రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ మండల కోర్డినేటర్లు, సీనియర్ నాయకులు సాకి ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షాబుద్దీన్‌తో కలిసి జై బాపు..జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం సందర్భంగా గాడిచర్లపల్లి, చౌడారం, మేడిపల్లి గ్రామాల్లో మంగళవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో చౌడారం గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టపర్తి చందు, మేడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు మంద శ్రీకాంత్, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి పాకాల భూపతిరెడ్డి, మందల తిరుపతిరెడ్డి, అనిల్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, ఫిషర్మెన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఉడుత ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు జయంత్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మెదక్‌డెస్క్

భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శమని మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఏఐసీసీ పిలుపు మేరకు కోహీర్ మండలంలోని బిలాల్పూర్, మనియార్పల్లి, కోహిర్‌తో పాటు జై బాబు.. జై భీమ్.. జై సంవిదాన్ రాజ్యాంగ రక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయనతో పాటు టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ధనలక్ష్మి, మండలాధ్యక్షులు రామలింగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైనారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం మన అందరి హక్కు బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనిల్ కుమార్, మాజీ ఎంపీపీ శోకతల్లి టౌన్ ప్రెసిడెంట్ శముర్ హ్యాలి, ముంతాజ్ అశ్రాపల్లి చాకిరెల్లి నెంబర్ హర్షద్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మెదక్‌డెస్క్

రాజ్యాంగంపై దాడులకు వ్యతిరేకంగా, వివక్షతకు వ్యతిరేకంగా, ఆర్థిక సామాజిక సమానత్వం, న్యాయం కోసం అందరూ కలిసికట్టుగా పోరాడుదామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెటల్‌కుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో గ్రామస్తులతో జై భీమ్ జై బాబు జై సావిదాన్ అనే నినాదం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. న్యాల్ కల్ మండలంలో గత వారం రోజులగా చాల్కి, ముంగి, రేజింతల్, వడ్డీ, న్యాల్ కల్, మెటల్ కుంట, పలు గ్రామాల్లో విస్తృత ర్యాలీలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తిరుపతి రెడ్డి, సొసైటీ చైర్మెన్ సిద్ధి లింగయ్య స్వామి, ముంగి శ్రీనివాసరెడ్డి, రత్నం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.